
జనం మెచ్చిన నేత, జనం కోసం పరి తపించే నేత, ప్రజలు మెచ్చిన నాయకుడు,
కేసముద్రం వ్యవసాయ మార్కెట్ చైర్మన్
గౌ॥ శ్రీ గంట సంజీవరెడ్డి గారికి
జన్మదిన శుభాకాంక్షలు
చిలువేరు సమ్మయ్య గౌడ్
కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు - కేసముద్రం

తరంగాలు
రిపోర్టర్లు కావలెను
అతి తక్కువ కాలంలో తెలుగు రాష్ట్రాల్లో అత్యంత ప్రజాదరణ పొందుతున్న 'తరంగాలు' జాతీయ దినపత్రిక నందు పనిచేయుటకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాలోని అన్ని మండలాల నుండి రిపోర్టర్లు కావలెను.
సంప్రదించండి...
ఎడిటర్: గడ్డం నాగరాజు గౌడ్
94949 23460

https://epaper.tharangalu.in
RNI. TELTEL / 2022 / 83463
జాతీయ దిన ప్రతిక

# తరంగాలు

Tharangalu Daily News Paper
ప్రతి అక్షరం.... సామాన్యుడి అస్త్రం...

హైదరాబాద్
బుధవారం
05 ఆగస్టు 2026
సంపుటి 03
సంచిక 296
పేజీలు 8
వెల రూ.5.00

Published From : Hyderabad,Circulated:Telangana,Andhrapradesh
Epaper: www.tharangalu.in.com








https://epaper.tharangalu.in

RNI. TELTEL / 2022 / 83463

జాతీయ దిన ప్రతిక

# తరంగాలు

Tharangalu Daily News Paper

ప్రతి అక్షరం.... సామాన్యుడి అస్త్రం...

హైదరాబాద్
బుధవారం
05 ఆగస్టు 2026
సంపుటి 03
సంచిక 296
పేజీలు 8
వెల రూ.5.00

Published From : Hyderabad,Circulated:Telangana,Andhrapradesh

Epaper: www.tharangalu.in.com


# ఈ20 పెట్రోల్‌కు పంజాబ్ బ్రేక్

- ఈ20 పెట్రోల్‌పై అసెంబ్లీ తీర్మానం
- సాధారణ పెట్రోల్ కూడా ఇవ్వాలన్న డిమాండ్
- నిపుణుల కమిటీ ఏర్పాటు చేయాలన్న సూచన
- భగవంత్ మాన్ ఆరోపణలు




చండీగఢ్, ఆగస్టు 4(తరంగాలు ప్రతినిధి): దేశవ్యాప్తంగా అమలవుతున్న ఈ20 పెట్రోల్ విధానంపై పంజాబ్ అసెంబ్లీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. 20 శాతం ఇథనాల్ మిశ్రమంతో కూడిన ఈ20 పెట్రోల్ వినియోగాన్ని దేశవ్యాప్తంగా నిలిపివేయాలని కోరుతూ మంగళవారం అసెంబ్లీలో తీర్మానాన్ని ఆమోదించింది. వినియోగదారులకు ఈ20 పెట్రోల్‌ను బలవంతంగా వినియోగించే పరిస్థితి లేకుండా, ఇథనాల్ లేని సాధారణ పెట్రోల్‌ను కూడా అందుబాటులో ఉంచాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. ఈ20 పెట్రోల్‌పై దేశవ్యాప్తంగా చర్చ జరుగుతున్న సమయంలో పంజాబ్ అసెంబ్లీ తీసుకున్న ఈ నిర్ణయం ప్రాధాన్యం సంతరించుకుంది. అసెంబ్లీలో జరిగిన చర్చ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ, ఈ20 పెట్రోల్‌కు అనుకూలంగా రూపొందించని పాత వాహనాల్లో ఇథనాల్ మిశ్రమ ఇంధనం వినియోగించడం వల్ల ఇంజిన్ పనితీరుపై ప్రతికూల ప్రభావం పడుతోందని పేర్కొన్నారు. మైలేజీ తగ్గడం, ఇంధన వ్యవస్థలో సాంకేతిక లోపాలు తలెత్తడం, నిర్వహణ వ్యయం పెరగడం వంటి సమస్యలపై వినియోగదారుల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రజలకు ప్రత్యామ్నాయంగా సాధారణ పెట్రోల్‌ను కూడా విక్రయించే అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు.

ఈ20 పెట్రోల్ వల్ల మైలేజీ తగ్గుతుంటే దానికి అనుగుణంగా ఇంధన ధరను తగ్గించాలని కూడా తీర్మానంలో పేర్కొన్నారు. అంతేకాకుండా ఆటోమొబైల్ ఇంజినీర్లు, పెట్రోలియం రంగ నిపుణులు, పర్యావరణ శాస్త్రవేత్తలు, వినియోగదారుల సంఘాల ప్రతినిధులు, రాష్ట్ర ప్రభుత్వాల ప్రతినిధులతో కూడిన స్వతంత్ర నిపుణుల కమిటీని ఏర్పాటు చేసి ఈ20 పెట్రోల్ ప్రభావంపై సమగ్ర అధ్యయనం నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఆ అధ్యయనం

మిగతా 2వ పేజీలో..



# ఖనిజ రంగానికి కేంద్రం కొత్త ఊపు!

- అన్వేషణ వేగవంతం.. కీలక ఖనిజాలపై ప్రత్యేక దృష్టి
- సుస్థిర మైనింగ్‌తో 'వికసిత్ భారత్' దిశగా అడుగులు
- కేంద్ర బొగ్గు,గనుల శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి

న్యూఢిల్లీ, ఆగస్టు 4 (తరంగాలు ప్రతినిధి): దేశ ఆర్థికాభివృద్ధికి కీలకమైన ఖనిజ రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కార్యాచరణను వేగవంతం చేస్తోంది. కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి మంగళవారం గనుల మంత్రిత్వ శాఖ సీనియర్ అధికారులతో ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు.దేశవ్యాప్తంగా కొనసాగుతున్న ప్రధాన

మిగతా 2వ పేజీలో..

# కాళేశ్వరమే రాష్ట్రానికి ఆధారం!



- కన్నెపల్లి నుంచి నీటిని ఎత్తిపోయాలని జీవన్‌రెడ్డి డిమాండ్
- కాంగ్రెస్ మంత్రుల తీరుపై విమర్శలు
- సాగు, తాగునీటి అవసరాలకు కాళేశ్వరం కీలకమని వ్యాఖ్య
- ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని పిలుపు

హైదరాబాద్, ఆగస్టు 4(తరంగాలు ప్రతినిధి) : రాష్ట్రంలో రానున్న నెలల్లో సాగునీరు, తాగునీటి అవసరాలను తీర్చాలంటే కాళేశ్వరం ఎత్తిపోతల పథకాన్ని పూర్తిస్థాయిలో వినియోగించాల్సిన అవసరం ఉందని బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి టి. జీవన్‌రెడ్డి అన్నారు. ఎల్‌నినో ప్రభావంతో దేశవ్యాప్తంగా కరువు పరిస్థితులు నెలకొన్నాయని, ఇటీవల అల్పపీడనాల కారణంగా కొన్ని ప్రాంతాల్లో వర్షాలు కురిసినా నీటి సమస్య పూర్తిగా తీరలేదని ఆయన పేర్కొన్నారు. మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో జీవన్‌రెడ్డి మాట్లాడుతూ,

మిగతా 2వ పేజీలో..



# 25 టన్నుల కల్తీ మసాలా దినుసులు పట్టివేత

- మసాలాల్లో కల్తీపై భారీ దాడులు -ముగ్గురు నిందితుల అరెస్టు..
- మూడు క్రిమినల్ కేసులు నమోదు
- హానికర రసాయనాలతో కల్తీ చేసినట్లు దర్యాప్తులో వెల్లడి
- హెచ్-ఫాస్ట్, ఆహార భద్రత శాఖ సంయుక్త తనిఖీలు

హైదరాబాద్, ఆగస్టు 4 (తరంగాలు ప్రతినిధి): నగరంలో ఆహార కల్తీని అరికట్టేందుకు హైదరాబాద్ ఫుడ్ అడల్టరేషన్ సర్వైలెన్స్ టీమ్ (హెచ్-ఫాస్ట్), జీహెచ్ఎంసీ ఆహార భద్రత శాఖ సంయుక్తంగా చేపట్టిన ప్రత్యేక తనిఖీల్లో భారీగా కల్తీ మసాలా దినుసులు పట్టుబడ్డాయి. ప్రజల నుంచి అందిన విశ్వసనీయ సమాచారం ఆధారంగా మసాలా దినుసుల వ్యాపార, ప్రాసెసింగ్ కేంద్రాలపై మంగళవారం విస్తృతంగా దాడులు నిర్వహించారు. మొత్తం 13 సంస్థలను తనిఖీ చేయగా, హానికర రసాయనాలతో కల్తీ చేసిన 25,300 కిలోల మసాలా దినుసులను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. తనిఖీల్లో మసాలా

మిగతా 2వ పేజీలో..

# బ్రహ్మోత్సవాలకు టీటీడీ కీలక నిర్ణయం

- తొమ్మిది రోజుల పాటు ఆర్జిత సేవలు, ప్రత్యేక దర్శనాలు రద్దు
- సామాన్య భక్తులకు అధిక ప్రాధాన్యం కల్పించనున్న టీటీడీ
- సెప్టెంబర్ 15 నుంచి 23 వరకు బ్రహ్మోత్సవాలు
- వాహన సేవల నిర్వహణకు విస్తృత ఏర్పాట్లు



తిరుమల, ఆగస్టు 4 (తరంగాలు ప్రతినిధి): కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వరస్వామివారి వార్షిక సాలకట్ల బ్రహ్మోత్సవాల నేపథ్యంలో తిరుమల తిరుపతి దేవస్థానం కీలక నిర్ణయం తీసుకుంది. సెప్టెంబర్ 15 నుంచి 23వ తేదీ వరకు నిర్వహించే బ్రహ్మోత్సవాల సందర్భంగా తొమ్మిది రోజుల పాటు అన్ని రకాల ఆర్జిత సేవలతో పాటు ప్రత్యేక ప్రవేశ దర్శనాలను రద్దు చేస్తున్నట్లు మంగళవారం ప్రకటించింది. ఉత్సవాలకు భారీ సంఖ్యలో తరలివచ్చే సామాన్య భక్తులకు ఎక్కువ అవకాశాలు కల్పించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. టీటీడీ ప్రకటన ప్రకారం బ్రహ్మోత్సవాల సమయంలో అష్టదళ పాదపద్మారాధన, తిరుప్పావడ, కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, సహస్ర దీపాలంకరణ వంటి అన్ని ఆర్జిత సేవలను పూర్తిగా నిలిపివేయనున్నారు. అదే విధంగా వృద్ధులు, దివ్యాంగులు, చంటిపిల్లల తల్లిదండ్రులు, ప్రవాస భారతీయులు, దాతలకు కల్పించే ప్రత్యేక ప్రవేశ దర్శనాలను కూడా ఈ కాలంలో రద్దు చేస్తున్నట్లు స్పష్టం చేశారు.ప్రతి ఏడాది బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీవారి దర్శనానికి లక్షలాది మంది భక్తులు తిరుమలకు

మిగతా 2వ పేజీలో..

# విధ్వంసం నుంచి పునర్నిర్మాణం: చంద్రబాబు

- వైసీపీ పాలనపై శ్వేతపత్రంలో తీవ్ర విమర్శలు
- రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను గాడిలో పెడుతున్నామని వెల్లడి
- అమరావతి, పోలవరం పూర్తే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం
- స్వర్ణాంధ్ర విజన్--2047'తో అభివృద్ధికి కార్యాచరణ

2వ పేజీలో..

# కార్చిచ్చు కబళించిన వాషింగ్టన్!

- అమెరికాలో కార్చిచ్చు బీభత్సం!
- 8 వేల ఎకరాలకు పైగా దగ్ధం..700కుపైగా నిర్మాణాలు బూడిద
- 65 వేల మందికి పైగా సురక్షిత ప్రాంతాలకు తరలింపు
- వేలాది కుటుంబాలు నిరాశ్రయం.. అత్యవసర పరిస్థితి ప్రకటించిన ట్రంప్



2వ పేజీలో..

# వరంగల్‌లో అతిపెద్ద క్యాన్సర్ ఆస్పత్రి

- రెండో అతిపెద్ద ప్రభుత్వ క్యాన్సర్ ఆస్పత్రి ఏర్పాటు
- ఏడాది చివరికి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ప్రారంభం
- ఉత్తర తెలంగాణకు వైద్య సేవల కేంద్రంగా వరంగల్
- వైద్య సేవలపై మంత్రుల సమీక్ష సమావేశం



హైదరాబాద్, ఆగస్టు 4: రాష్ట్రంలో రెండో అతిపెద్ద ప్రభుత్వ క్యాన్సర్ ఆస్పత్రిని వరంగల్‌లో ఏర్పాటు చేయనున్నట్లు ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ప్రకటించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాతో పాటు ఉత్తర తెలంగాణ ప్రజలకు అత్యాధునిక క్యాన్సర్ వైద్య సేవలు అందించేందుకు వరంగల్ ప్రాంతీయ క్యాన్సర్ ఆస్పత్రిని మరింత అభివృద్ధి చేస్తామని తెలిపారు. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని

మిగతా 2వ పేజీలో..

## ఖనిజ రంగానికి కేంద్రం కొత్త ఊపు!

గనుల ప్రాజెక్టులు, ఖనిజ అన్వేషణ కార్యక్రమాల పురోగతిని మంత్రి సమీక్షించారు. కొత్త ఖనిజ నిల్వలను గుర్తించడంతో పాటు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో అన్వేషణ ప్రక్రియను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. దేశ అవసరాలకు అనుగుణంగా ఖనిజ వనరుల లభ్యతను పెంచేందుకు అన్వేషణ కార్యక్రమాలను వేగవంతం చేయాలని ఆదేశించారు.

### కీలక ఖనిజాలపై ఫోకస్

భవిష్యత్ పారిశ్రామిక అవసరాలకు అత్యంత ప్రాధాన్యమైన క్రిటికల్ మినరల్స్ ఉత్పత్తి, నిల్వలు, సరఫరా వ్యవస్థలను మరింత పటిష్టం చేయాలని కిషన్‌రెడ్డి సూచించారు. దేశ స్వావలంబనను పెంచేలా వ్యూహాత్మక కార్యాచరణ రూపొందించాలని, ఈ రంగంలో పెట్టుబడులను ప్రోత్సహించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులతో చర్చించారు.

### పర్యావరణ పరిరక్షణతో మైనింగ్

సహజ వనరుల వినియోగంతో పాటు పర్యావరణ పరిరక్షణకు సమాన ప్రాధాన్యం ఇవ్వాలని మంత్రి స్పష్టం చేశారు. భవిష్యత్ తరాలకు సహజ వనరులను సంరక్షించే విధంగా సుస్థిర మైనింగ్ విధానాలను అమలు చేయాలని సూచించారు. పారదర్శకత, ఆధునిక సాంకేతికత, సమర్థ నిర్వహణతో గనుల రంగాన్ని మరింత బలోపేతం చేయాలని అధికారులను ఆదేశించారు.

### వికసిత్ భారత్‌కు కీలక భూమిక


'వికసిత్ భారత్' లక్ష్య సాధనలో ఖనిజ రంగం కీలక పాత్ర పోషిస్తుందని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా ముడి పదార్థాల లభ్యతను పెంచడంతో పాటు ఖనిజ వనరులను సమర్థవంతంగా వినియోగించేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు కొనసాగిస్తుందని తెలిపారు.సమావేశంలో గనుల మంత్రిత్వ శాఖ సీనియర్ అధికారులు పాల్గొని వివిధ ప్రాజెక్టుల పురోగతి, భవిష్యత్ కార్యాచరణ, అమలులో ఉన్న సంస్కరణలను మంత్రికి వివరించారు.

# బ్రహ్మోత్సవాలకు టీటీడీ కీలక నిర్ణయం

చేరుకుంటారు. ఈ నేపథ్యంలో సాధారణ భక్తులకు దర్శనం సులభతరం చేయడం, వేచి ఉండే సమయాన్ని తగ్గించడం లక్ష్యంగా టీటీడీ ఈ చర్యలు చేపట్టింది. ఉత్సవాల సమయంలో సాధారణ దర్శనానికి అత్యధిక ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు అధికారులు తెలిపారు. బ్రహ్మోత్సవాల తొమ్మిది రోజుల పాటు శ్రీవారి వాహన సేవలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు టీటీడీ పేర్కొంది. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని భద్రత, క్యూలైన్లు, తాగునీరు, పారిశుద్ధ్యం, వైద్య సేవలు, రవాణా వంటి అన్ని సౌకర్యాలను మరింత విస్తృతంగా ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించింది.

బ్రహ్మోత్సవాలకు హాజరయ్యే భక్తులు ఈ మార్పులను ముందుగానే గమనించి తమ దర్శన ప్రణాళికలను రూపొందించుకోవాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. రద్దు చేసిన సేవలు, ప్రత్యేక దర్శనాలపై ఎలాంటి అపోహలు పెట్టుకోకుండా అధికారిక సమాచారాన్నే పరిగణనలోకి తీసుకోవాలని సూచించింది. భక్తులందరికీ ప్రశాంతంగా, సౌకర్యవంతంగా స్వామివారి దర్శనం కల్పించడమే టీటీడీ ప్రధాన లక్ష్యమని అధికారులు తెలిపారు. ఈ మేరకు టీటీడీ ముఖ్య ప్రజాసంబంధాల అధికారి కార్యాలయం అధికారిక ప్రకటన విడుదల చేసి, బ్రహ్మోత్సవాల విజయవంత నిర్వహణకు భక్తుల సహకారం అందించాలని కోరింది.

## కార్చిచ్చు కబళించిన వాషింగ్టన్!



వాషింగ్టన్, ఆగస్టు 4 (తరంగాలు ప్రతినిధి): అమెరికాలోని వాషింగ్టన్ రాష్ట్రంలో కార్చిచ్చులు తీవ్ర విధ్వంసం సృష్టిస్తున్నాయి. తూర్పు వాషింగ్టన్‌లోని స్పోకేన్ నగరం, పరిసర ప్రాంతాల్లో మంటలు వేగంగా వ్యాపించడంతో 65 వేల మందికి పైగా ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. వందలాది ఇళ్లు, ఇతర నిర్మాణాలు అగ్నికి ఆహుతయ్యాయి.స్పోకేన్ నగర పరిసరాల్లో చెలరేగిన మూడు ప్రధాన కార్చిచ్చులు ఇంకా పూర్తిగా అదుపులోకి రాలేదని అధికారులు తెలిపారు. ఈ విపత్తు తమ ప్రాంత చరిత్రలోనే అత్యంత తీవ్రమైన ప్రకృతి విపత్తుల్లో ఒకటని స్పోకేన్ మేయర్ లీసా బ్రౌన్ పేర్కొన్నారు. ప్రాణ, ఆస్తి నష్టంపై అధికారులు సమగ్రంగా అంచనా వేస్తున్నారు.

అమెరికన్ రెడ్ క్రాస్ ప్రాథమిక అంచనా ప్రకారం ఇప్పటివరకు 700కుపైగా ఇళ్లు, ఇతర నిర్మాణాలు దగ్ధమయ్యాయి. వేలాది కుటుంబాలు నిరాశ్రయులయ్యాయి. బాధితుల కోసం సహాయక శిబిరాలను ఏర్పాటు చేసి ఆహారం, తాగునీరు, ఇతర అత్యవసర సదుపాయాలు అందిస్తున్నారు.'ఓల్డ్ ట్రెయిల్స్ ఫైర్'కు సంబంధించి లిఆరోన్ ఎఫ్. ఫారినా (37)లిను పోలీసులు అరెస్ట్ చేశారు. ఉద్దేశపూర్వకంగా మంటలు పెట్టినట్లు ఆరోపిస్తూ అతడిపై కేసు నమోదు చేసినట్లు స్పోకేన్ కౌంటీ షెరీఫ్ జాన్ నోవెల్స్ వెల్లడించారు. ఒక మిలియన్ డాలర్ల పూచీకత్తు విధించినట్లు తెలిపారు.శనివారం ప్రారంభమైన మంటలు ఇప్పటికే 8,026 ఎకరాలకు పైగా విస్తరించాయి. వాతావరణ పరిస్థితులు కొంత అనుకూలించడంతో అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నారు. సర్వం కోల్పోయిన బాధితులు తమ ఇళ్లకు చేరుకుని కాలిపోయిన శిథిలాలను చూసి కన్నీరుమున్నీరవుతున్నారు.వాషింగ్టన్ గవర్నర్ బాబ్ ఫెర్గుసన్‌తో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మాట్లాడిన అనంతరం రాష్ట్రవ్యాప్తంగా అత్యవసర పరిస్థితిని ప్రకటించారు. ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలను ముమ్మరం చేశారు. ఈ వారం ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

# కాళేశ్వరమే రాష్ట్రానికి ఆధారం!

రానున్న ఎనిమిది నెలల పాటు సాగునీరు, తాగునీటి అవసరాలు నిరంతరంగా అందించాలంటే కాళేశ్వరం ప్రాజెక్టు కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. రాష్ట్రంలోని జలవనరులను సమర్థంగా వినియోగించే దిశగా ప్రభుత్వం నిర్ణయాలు తీసుకోవాలని కోరారు.కాంగ్రెస్ ప్రభుత్వ మంత్రులు కన్నెపల్లి ప్రాంతాన్ని సందర్శించకుండా ఎస్సారె-స్పీ ప్రాంతానికి వెళ్లడాన్ని ఆయన విమర్శించారు. నీటి సమస్యల పరిష్కారంపై వాస్తవ పరిస్థితులను పరిశీలించి, అవసరమైన నిర్ణయాలు తీసుకోవాల్సిన సమయంలో ప్రభుత్వం సరైన ప్రాధాన్యత ఇవ్వడం లేదని ఆరోపించారు. నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పెద్దమనసుతో వ్యవహరించి రాజకీయాలకు అతీతంగా నిర్ణయాలు తీసుకోవాలని జీవన్‌రెడ్డి సూచించారు. కన్నెపల్లి నుంచి నీటిని ఎత్తిపోసే ప్రక్రియను ప్రారంభించి రైతులు, ప్రజలకు అవసరమైన నీటిని అందించేందుకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.రాష్ట్రంలో వ్యవసాయ రంగం, తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని కాళేశ్వరం ప్రాజెక్టును సమర్థవంతంగా వినియోగించాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. నీటి నిర్వహణలో ప్రభుత్వం దీర్ఘకాలిక ప్రణాళికతో ముందుకు సాగాలని, భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతులు, ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తక్షణ నిర్ణయాలు తీసుకోవాలని జీవన్‌రెడ్డి కోరారు. రాష్ట్రంలో నీటి కొరత తలెత్తకుండా అన్ని ప్రత్యామ్నాయాలను వినియోగించి సాగునీరు, తాగునీటి సరఫరా నిరంతరంగా కొనసాగించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

# విధ్వంసం నుంచి పునర్నిర్మాణం: చంద్రబాబు

అమరావతి, ఆగస్టు 4 ఆంధ్రప్రదేశ్ ఆర్థిక పరిస్థితిపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మంగళవారం శ్వేతపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా గత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ పాలనను "విధ్వంసం"గా అభివర్ణించిన ఆయన, ఎన్డీయే ప్రభుత్వం రాష్ట్ర "పునర్నిర్మాణం" కోసం కృషి చేస్తోందని పేర్కొన్నారు. 2019 నుంచి 2024 మధ్య రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ తీవ్రంగా దెబ్బతిన్నదని, ప్రభుత్వ సంస్థలు బలహీనపడ్డాయని, రాష్ట్రం భారీ అప్పుల ఊబిలో చిక్కుకుందని ఆరోపించారు. గత రెండేళ్లలో తమ ప్రభుత్వం చేపట్టిన ఆర్థిక సంస్కరణలు, భవిష్యత్ కార్యాచరణను శ్వేతపత్రంలో వివరించారు. 2024 ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పు రాష్ట్ర పునర్నిర్మాణానికి నాంది పలికిందని చంద్రబాబు అన్నారు. గత ప్రభుత్వ హయాంలో అమరావతి రాజధాని పనులు నిలిచిపోయాయని, పోలవరం ప్రాజెక్టు పురోగతి దెబ్బతిందని, పారిశ్రామిక రంగం వెనుకబడిందని విమర్శించారు. ప్రధాని నరేంద్ర మోదీ సహకారంతో రాష్ట్రాన్ని మళ్లీ అభివృద్ధి మార్గంలో నడిపిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర విభజన వల్ల ఎదురైన నష్టాల కంటే గత ఐదేళ్ల పాలన వల్ల కలిగిన నష్టం ఎక్కువగా ఉందని, పరిపాలనా వ్యవస్థలు, అధికార యంత్రాంగం పనితీరు కూడా దెబ్బతిన్నాయని ఆరోపించారు.

ఆర్థిక సూచీలను ప్రస్తావిస్తూ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మధ్య తలసరి ఆదాయ వ్యత్యాసం గత ఐదేళ్లలో గణనీయంగా పెరిగిందని చంద్రబాబు పేర్కొన్నారు. గత ప్రభుత్వం ఆర్థిక క్రమశిక్షణ పాటించకపోవడం వల్ల రాష్ట్ర ఆదాయ సామర్థ్యం తగ్గిందని, రూ.9.74 లక్షల కోట్ల అప్పు భారం రాష్ట్రంపై పడిందని తెలిపారు. అధికారంలోకి వచ్చిన తర్వాత పెండింగ్ బిల్లుల్లో రూ.29 వేల కోట్లకు పైగా చెల్లించామని, ఉద్యోగుల బకాయిలు కూడా భారీగా క్లియర్ చేశామని వెల్లడించారు. అధిక వడ్డీ రుణాలను పునర్వ్యవస్థీకరించడం ద్వారా వేల కోట్ల రూపాయల ఆదా సాధించామని చెప్పారు. సంక్షేమం, అభివృద్ధి రెండింటినీ సమన్వయంతో ముందుకు తీసుకెళ్తున్నామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. గత రెండేళ్లలో సంక్షేమ పథకాల కోసం రూ.1.49 లక్షల కోట్లకు పైగా ఖర్చు చేశామని, ఎన్టీఆర్ భరోసా, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ వంటి పథకాలకు భారీ నిధులు విడుదల చేసినట్లు తెలిపారు. అదే సమయంలో 30 వేలకుపైగా ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేశామని, మెగా డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ నియామకాలు చేపట్టామని గుర్తుచేశారు. సంక్షేమం అంటే కేవలం నగదు పంపిణీ కాదని, కుటుంబాలను ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యమని చెప్పారు.

ప్రజల భాగస్వామ్యంతో అభివృద్ధిని వేగవంతం చేసేందుకు 'పి--4' (పీపుల్స్ పార్ట్‌నర్‌షిప్) విధానాన్ని అమలు చేస్తున్నామని చంద్రబాబు వెల్లడించారు. సమాజంలో ఆర్థికంగా బలమైన కుటుంబాలు వెనుకబడిన కుటుంబాలను ఆదుకునేలా 'మార్గదర్శి బంగారు కుటుంబం' కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. అమరావతి రాజధాని నిర్మాణానికి ఇప్పటికే భారీ నిధులు సమీకరించామని, పోలవరం ప్రాజెక్టును నిర్దేశిత గడువులో పూర్తి చేసి దేశానికి అంకితం చేస్తామని పేర్కొన్నారు. రాష్ట్రాన్ని విశాఖ, అమరావతి, తిరుపతి అనే మూడు ఆర్థిక ప్రాంతాలుగా అభివృద్ధి చేసే కార్యాచరణను కూడా చంద్రబాబు వివరించారు. విశాఖను పోర్టు ఆధారిత పారిశ్రామిక కేంద్రంగా, అమరావతిని నాలెడ్జ్ మరియు పరిపాలనా రాజధానిగా, తిరుపతిని అంతరిక్ష, రక్షణ, ఎలక్ట్రానిక్స్ పరిశ్రమల కేంద్రంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. ఆదాయాన్ని పెంచుతూ, వ్యయ నియంత్రణతో ఆర్థిక క్రమశిక్షణ పాటించి 'స్వర్ణాంధ్ర విజన్--2047' సాధనే ప్రభుత్వ ధ్యేయమని స్పష్టం చేస్తూ రాష్ట్ర పునర్నిర్మాణంలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు.

# 25 టన్నుల కల్తీ మసాలా దినుసులు పట్టివేత

దినుసుల రంగు, మెరుపు, బరువు పెంచి అక్రమ లాభాలు పొందేందుకు పారిశ్రామిక రంగులు, కృత్రిమ ఆహార రంగులు, టాల్కం పౌడర్, బియ్యం తవుడు నూనెతో పాటు తినడానికి అనర్హమైన ఇతర పదార్థాలను ఉపయోగిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. వాము, జీలకర్ర, షాజీరా, లవంగాలు, ఆవాలు, సోంపు వంటి మసాలా దినుసుల్లో ఈ హానికర పదార్థాలు కలిపినట్లు దర్యాప్తులో వెల్లడైంది.

ఈ వ్యవహారంలో మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో రెండు, బాలాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక కేసు నమోదు చేశారు. మొత్తం మూడు క్రిమినల్ కేసులు నమోదు చేసి ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు హైదరాబాద్ సిటీ పోలీసులు వెల్లడించారు. కేసులపై మరింత లోతైన దర్యాప్తు కొనసాగుతోందని అధికారులు తెలిపారు. దాడుల సందర్భంగా 25,300 కిలోల కల్తీ మసాలా దినుసులతో పాటు 89,150 కిలోల ముడి పదార్థాలు, 12 లీటర్ల బియ్యం తవుడు నూనె, 1.5 కిలోల కృత్రిమ, పారిశ్రామిక రంగులు, మూడు రోలింగ్ యంత్రాలను కూడా స్వాధీనం చేసుకున్నారు. వీటిని పరిశీలన కోసం సంబంధిత శాఖల ఆధీనంలోకి తీసుకున్నట్లు అధికారులు పేర్కొన్నారు.ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించే ఆహార కల్తీని ఏమాత్రం సహించబోమని పోలీసులు, ఆహార భద్రత శాఖ స్పష్టం చేశాయి. ఆహార పదార్థాల తయారీ, విక్రయాల్లో నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు కొనసాగుతాయని హెచ్చరించాయి. అనుమానాస్పద ఆహార ఉత్పత్తులపై సమాచారం అందిస్తే వెంటనే స్పందించి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నాయి. ఆహార భద్రత పరిరక్షణ కోసం నగరవ్యాప్తంగా ఇటువంటి ప్రత్యేక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని అధికారులు తెలిపారు. ప్రజలు నాణ్యమైన ఆహార పదార్థాలనే కొనుగోలు చేయాలని, కల్తీపై అనుమానం ఉన్న వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

## వరంగల్‌లో అతిపెద్ద క్యాన్సర్ ఆస్పత్రి

ఈ ఏడాది చివరికల్లా ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని వెల్లడించారు. మంగళవారం సచివాలయంలో మంత్రి కొండా సురేఖతో కలిసి వరంగల్, హనుమకొండ, జనగామ జిల్లాల్లో ప్రభుత్వ వైద్య సేవలపై మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ వైద్య కళాశాలలు, జనరల్ ఆస్పత్రులు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఏరియా ఆస్పత్రుల్లో అందుతున్న వైద్య సేవలు, మౌలిక వసతులు, అభివృద్ధి పనుల పురోగతిని సమీక్షించారు. ఎమ్మెల్యేలు సూచించిన సమస్యలను వెంటనే పరిశీలించి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.ఎంజీఎం ఆస్పత్రిలో ప్రస్తుతం 29 ప్రత్యేక విభాగాల్లో వైద్య సేవలు అందుతున్నాయని, త్వరలో మరో తొమ్మిది సూపర్ స్పెషాలిటీ సేవలను ప్రారంభిస్తామని మంత్రి తెలిపారు. వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని ఉత్తర తెలంగాణ ప్రజలకు అన్ని రకాల వైద్య సేవలు అందించే ప్రధాన వైద్య కేంద్రంగా తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు. నిమ్స్ తరహాలో వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి ఎల్‌వోసీలు మంజూరు చేసి, అత్యాధునిక వైద్య పరికరాలు, అవసరమైన నిపుణులైన వైద్యులు, సిబ్బందిని నియమించి పూర్తి స్థాయిలో సేవలు అందుబాటులోకి తీసుకొస్తామని వెల్లడించారు. జనగామ, నర్సంపేట ప్రభుత్వ ఆస్పత్రులు, వైద్య కళాశాలలను కూడా మరింత అభివృద్ధి చేస్తామని చెప్పారు.హనుమకొండలో ఐవీఎఫ్ కేంద్రంతో పాటు ఔషధ, ఆహార పరీక్షల ప్రయోగశాలను ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి వెల్లడించారు. ప్రాంతీయ నేత్ర ఆస్పత్రిలో అత్యాధునిక కంటి వైద్య సేవలు ప్రారంభించనున్నట్లు తెలిపారు. పరకాల, వర్ధన్నపేట, స్టేషన్ ఘన్‌పూర్, బచ్చన్నపేట, పాలకుర్తి, కమలాపూర్ ప్రాంతాలకు ఇప్పటికే మంజూరైన డయాలసిస్ కేంద్రాలను త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో మానవ వనరులు, మౌలిక సదుపాయాలు, అత్యాధునిక వైద్య పరికరాలు, ఔషధాలు, నిర్ధారణ సేవలను మరింత బలోపేతం చేస్తున్నామని మంత్రి తెలిపారు. జిల్లా స్థాయిలోనే నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులోకి రావడంతో హైదరాబాద్‌లోని నిమ్స్, గాంధీ, ఉస్మానియా వంటి ప్రధాన ఆస్పత్రులపై రోగుల ఒత్తిడి తగ్గుతుందని పేర్కొన్నారు. సమావేశంలో పలువురు ఎమ్మెల్యేలు, ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు, వైద్య కళాశాలల ప్రిన్సిపాళ్లు, ప్రభుత్వ ఆస్పత్రుల సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

## ఈ20 పెట్రోల్‌కు పంజాబ్ బ్రేక్

నివేదిక ఆధారంగానే తదుపరి విధాన నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. సభలో ముఖ్యమంత్రి భగవంత్ మాన్ మాట్లాడుతూ, సుమారు 45 వేల వాహనాలపై నిర్వహించిన అధ్యయనంలో ఈ20 పెట్రోల్ వినియోగం కారణంగా మైలేజీ తగ్గినట్లు, కొన్ని వాహనాల్లో సాంకేతిక సమస్యలు కూడా తలెత్తినట్లు గుర్తించారని తెలిపారు. వినియోగదారుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం ఈ అంశాన్ని మరోసారి సమీక్షించాలని కోరారు. ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా ఒకే విధమైన ఇంధన విధానాన్ని అమలు చేయడం సరికాదని అన్నారు.ఇటీవల అమెరికాతో కుదిరిన వాణిజ్య ఒప్పందం నేపథ్యంలోనే ఈ20 పెట్రోల్ వినియోగాన్ని కేంద్ర ప్రభుత్వం వేగంగా అమలు చేస్తోందని భగవంత్ మాన్ ఆరోపించారు. ఆ ఒప్పందంలో భాగంగా భారత్ భారీ మొత్తంలో ఇథనాల్ కొనుగోలు చేయాల్సి ఉంటుందని, అందుకే దేశంలో ఇథనాల్ మిశ్రమ ఇంధనాన్ని ప్రోత్సహిస్తున్నారని ఆయన వ్యాఖ్యానించారు. ఈ ఆరోపణలు రాజకీయంగా చర్చనీయాంశంగా మారాయి. అయితే ముఖ్యమంత్రి చేసిన ఆరోపణలపై కేంద్ర ప్రభుత్వం ఇప్పటివరకు అధికారికంగా స్పందించలేదు. మరోవైపు పర్యావరణ పరిరక్షణ, ముడి చమురు దిగుమతుల తగ్గింపు, ప్రత్యామ్నాయ ఇంధనాల వినియోగాన్ని పెంచే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఈ20 పెట్రోల్ విధానాన్ని అమలు చేస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో పంజాబ్ అసెంబ్లీ ఆమోదించిన తీర్మానం దేశవ్యాప్తంగా ఇథనాల్ మిశ్రమ ఇంధన విధానంపై కొత్త చర్చకు దారితీసే అవకాశముందని రాజకీయ, పారిశ్రామిక వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

# వైఎస్సార్‌సీపీలోకి టీడీపీ నేత గూడపాటి శ్రీనివాసరావు

- తాడేపల్లిలో జగన్ సమక్షంలో పార్టీలో చేరిక
- వందలాది మంది అనుచరులతో కలిసి వైఎస్సార్‌సీపీలో చేరిన సీనియర్ నేత
- రేపల్లెలో పార్టీ మరింత బలోపేతం అవుతుందని జగన్ వ్యాఖ్య
- ఐక్యంగా పనిచేసి వచ్చే ఎన్నికల్లో విజయం సాధించాలని పిలుపు

తాడేపల్లి, ఆగస్టు 4 : రేపల్లె నియోజకవర్గ రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. తెలుగుదేశం పార్టీకి చెందిన సీనియర్ నేత, కాపు సామాజిక వర్గ నాయకుడు గూడపాటి శ్రీనివాసరావు మంగళవారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. వందలాది మంది అనుచరులతో కలిసి తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయానికి చేరుకున్న ఆయన, పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో పార్టీ కండువా కప్పుకుని వైఎస్సార్‌సీపీలో చేరారు. గూడపాటి శ్రీనివాసరావు, ఆయన అనుచరులకు జగన్‌మోహన్‌రెడ్డి పార్టీలోకి స్వాగతం పలికారు. రేపల్లె ప్రాంతంలో సుదీర్ఘ రాజకీయ అనుభవం కలిగిన నాయకుడు పార్టీలో చేరడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. ఆయనకు పార్టీలో తగిన గౌరవం, ప్రాధాన్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఆయన అనుభవం పార్టీ బలోపేతానికి ఉపయోగపడుతుందని అభిప్రాయపడ్డారు.

రేపల్లె నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి పీత నాగమోహన కృష్ణతో కలిసి సమన్వయంతో పనిచేయాలని జగన్ సూచించారు. ఆయనను తమ్ముడిలా భావించి ఐక్యంగా పార్టీని మరింత బలోపేతం చేయాలని కోరారు. రానున్న ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా ప్రతి నాయకుడు, కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. గూడపాటి శ్రీనివాసరావు చేరికతో రేపల్లె పట్టణంతో పాటు నియోజకవర్గంలో పార్టీ మరింత బలపడుతుందని జగన్ విశ్వాసం వ్యక్తం చేశారు. వివిధ వర్గాల ప్రజలను పార్టీకి చేరువ చేస్తూ క్షేత్రస్థాయిలో పార్టీ విస్తరణకు కృషి చేయాలని నాయకులకు సూచించారు. కొత్తగా పార్టీలో చేరిన నాయకులు, కార్యకర్తలు ప్రజా సమస్యల పరిష్కారంలో చురుకుగా పాల్గొనాలని కోరారు.ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు అంబటి రాంబాబు, పేర్ని వెంకట్రామయ్య (నాని), ఎంపీ మిథున్ రెడ్డి, మెరుగు నాగార్జున, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, అంబటి మురళి, నందిగం సురేష్, రేపల్లె నియోజకవర్గ ఇన్‌చార్జి పీత నాగమోహన కృష్ణతో పాటు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. గూడపాటి శ్రీనివాసరావుతో పాటు పెద్ద సంఖ్యలో అనుచరులు వైఎస్సార్‌సీపీలో చేరడం పార్టీకి ఊతమిస్తుందని నాయకులు అభిప్రాయపడ్డారు. రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసే దిశగా ఇలాంటి చేరికలు కొనసాగుతాయని వైఎస్సార్‌సీపీ వర్గాలు పేర్కొన్నాయి.

THARANGALU DAILY NEWS
బుధవారం, 05 ఆగస్టు , 2026
జాతీయ దిన పత్రిక
తరంగాలు

## నిరుద్యోగుల సహనాన్ని పరీక్షించొద్దు

- ఖాళీ పోస్టులన్నింటికీ నోటిఫికేషన్లు జారీ చేయాలి
- పోలీస్ శాఖలో 20 వేల పోస్టులకు నోటిఫికేషన్ ఇవ్వాలి
- డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గడ్డం వెంకటేష్, జిల్లా సహాయ కార్యదర్శి కవిడే సురేష్




**యాదాద్రి భువనగిరి జిల్లా, ఆగస్టు 4 (తరంగాలు):** తెలంగాణలో వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గడ్డం వెంకటేష్, జిల్లా సహాయ కార్యదర్శి కవిడే సురేష్ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక అమరవీరుల కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో వారు మాట్లాడారు.ఎన్నికల సమయంలో ఏటా రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు గడిచినా ఖాళీ పోస్టుల భర్తీలో నిర్లక్ష్యం వహిస్తోందని ఆరోపించారు. రాష్ట్రంలోని ప్రభుత్వ శాఖల్లో 1,14,440 పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు.పోలీస్ శాఖలో సివిల్ కానిస్టేబుల్, ఆర్మ్డ్ రిజర్వ్ కానిస్టేబుల్, సబ్ఇన్స్పెక్టర్ తదితర పోస్టులు పెద్ద సంఖ్యలో ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. కేవలం కొన్ని వేల పోస్టుల భర్తీకి అనుమతులు ఇచ్చి మిగిలిన పోస్టులను ఎప్పుడు భర్తీ చేస్తారని ప్రశ్నించారు. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగుల పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం వెంటనే ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేయాలని, పోలీస్ శాఖలో 20 వేల పోస్టులకు నోటిఫికేషన్ జారీ చేయాలని డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో మండల అధ్యక్షుడు ధ్యానబోయిన యాదగిరి, జిల్లా కమిటీ సభ్యుడు ఆకుల రాజు, మండల ఉపాధ్యక్షుడు పెద్దబోయిన భీమరాజు, చెరుకు ఉపేందర్, గర్దాసు మనోహర్, రాపోలు నవీన్, దండు వేణు, బబ్లూ తదితరులు పాల్గొన్నారు.

## ఓబీసీ మోర్చా అసెంబ్లీ కన్వీనర్‌గా రంగా శ్రీనివాస్ గౌడ్



**కుత్బుల్లాపూర్ ఆగస్టు 04 ( తరంగాలు )**

భారతీయ జనతా పార్టీ ఓబీసీ మోర్చా కుత్బుల్లాపూర్ అసెంబ్లీ కన్వీనర్‌గా రంగారెడ్డి నగర్ డివిజన్ గాంధీనగర్ ప్రాంతానికి చెందిన రంగా శ్రీనివాస్ గౌడ్ నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం ఓబీసీ మోర్చా మేడ్చల్ జిల్లా (అర్బన్) అధ్యక్షులు జెకె. శేఖర్ యాదవ్ నియామకాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పార్టీలో క్రియాశీలకంగా, నిబద్ధతతో పనిచేసే ప్రతి కార్యకర్తకు సముచిత గుర్తింపు, బాధ్యతలు లభిస్తాయని తెలిపారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన రంగా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ, మూడు దశాబ్దాలకుపైగా బీజేపీలో సాధారణ కార్యకర్తగా ప్రారంభించి అంకితభావంతో పనిచేసిన తన సేవలను గుర్తించి ఈ బాధ్యతలు అప్పగించడం ఆనందంగా ఉందన్నారు. ఈ పదవి తనపై మరింత బాధ్యతను పెంచిందని పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని పేర్కొన్నారు. తనకు ఈ పదవి రావడానికి సహకరించిన ఓబీసీ మోర్చా రాష్ట్ర నాయకత్వానికి, సికింద్రాబాద్ మహంకాళి ఇన్‌చార్జి నందనం దివాకర్, అలాగే పార్టీ నాయకులు, కార్యకర్తలందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు.

## వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఎంపీడీవో అధికారులు



**యాదాద్రి భువనగిరి జిల్లా ఆర్సీ ఆగస్టు 4 తరంగాలు**

వలిగొండ మండల కేంద్రంలో మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ప్రత్యేక ప్రధాన కార్యదర్శి స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఆదేశాల మేరకు మండల పరిషత్ అభివృద్ధి అధికారి జలంధర్ రెడ్డిఈ వీడియో కాన్ఫరెన్స్‌లో క్రింది అంశాలపై సమగ్రంగా చర్చి, సంబంధిత అధికారులకు మార్గదర్శకాలు జారీ చేయబడ్డాయి.గ్రామ పంచయతీ సమగ్ర అభివృద్ధి ప్రణాళిక జి పి ఎస్ ఏ పిగ్రామ సంఘాల వివో ఎస్ ద్వారా ఫార్మ్ పాండ్స్ ఏర్పాటుపాఠశాల విద్యార్థుల యూనిఫాం కుట్టింపు కార్యక్రమంఇతర అభివృద్ధి మరియు సంక్షేమ కార్యక్రమాలుఈ సందర్భంగా ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ప్రభుత్వ కార్యక్రమాలను గ్రామ స్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని, సంబంధిత శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి నిర్దేశిత లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ ఓ వై ప్రేమలత,ఏ పీ ఎం అంజయ్య,ఆర్డబ్ల్యూఎస్ కే శ్రీ కీర్తి, వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు మండల కేంద్రం నుండి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్లో పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చేయూత



**రాయపర్తి, ఆగస్టు 4, తరంగాలు** :బాధిత కుటుంబానికి ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బియ్యం పంపిణీ చేసి ఎస్ ఆర్ ఆర్ ఫౌండేషన్ చైర్మన్ పరుపాటి శ్రీనివాస్ రెడ్డి ఆ కుటుంబానికి చేయూతనందించారు.రాయపర్తి మండలం కేశవపురం గ్రామానికి చెందిన చిలుముల్ల సోమనర్సయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, ఆయన కుటుంబాన్ని ఎస్ ఆర్ ఆర్ ఫౌండేషన్ చైర్మన్, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు పరుపాటి శ్రీనివాస్ రెడ్డి పరామర్శించారు. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆదేశాల మేరకు ఫౌండేషన్ ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి 50 కిలోల బియ్యాన్ని అందించి అండగా నిలిచారు.ఈ సహాయాన్ని మండల పార్టీ నాయకులు లేతకుల రంగారెడ్డి, సంకినేని ఎల్లస్వామి కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మోలుగురి పున్నమయ్య, నాయకులు అలుగోజు రమేష్, ములుగురి శ్రీనివాస్, ఖమ్మం అశోక్, చిలుముల్ల యాకయ్య, చిలుముల్ల కృష్ణ, రావుల రామయ్య, చీపురు జంపయ్య, నీలం నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మార్పీ ధరలకే ఎరువులు విక్రయించాలి

- హనుమకొండ జిల్లా ఇన్చార్జి కలెక్టర్ ఎన్. రవి



ఐనవోలులోని లక్ష్మి ఫర్టిలైజర్ దుకాణాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా ఇన్చార్జి కలెక్టర్

హనుమకొండ ప్రతినిధి, ఆగస్టు 4,తరంగాలు : ప్రభుత్వం నిర్ణయించిన ఎమ్మార్పీ ధరలకే ఎరువులు, విత్తనాలు విక్రయించాలని హనుమకొండ జిల్లా ఇన్చార్జి కలెక్టర్ ఎన్. రవి అన్నారు.మంగళవారం హనుమకొండ జిల్లా ఐనవోలు మండల కేంద్రంలోని లక్ష్మి ఫర్టిలైజర్ దుకాణాన్ని జిల్లా ఇన్చార్జి కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డిఏపి, ఇతర ఎరువుల నిల్వలను షాపు యజమాని తిరుపతిని జిల్లా ఇన్చార్జి కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఫర్టిలైజర్ షాప్ కు ఎక్కడినుండి ఎరువులు విత్తనాలు వస్తుంటాయనే సమాచారాన్ని ఆరా తీశారు. ఇప్పటివరకు ఎన్ని యూరియా బస్తాలు విక్రయించారని, వాటికి సంబంధించిన రికార్డును తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఇన్చార్జి కలెక్టర్ రవి మాట్లాడుతూ నిర్ణయించిన ధరలకే ఎరువులు, విత్తనాలు విక్రయించాలని అన్నారు. యూరియా, ఇతర ఎరువులు, రైతులకు అందుబాటులో ఉండే విధంగా చూసుకోవాలన్నారు.ఈ కార్యక్రమం లో తహసిల్దార్ విక్రమ్ కుమార్, మండల వ్యవసాయ అధికారి సునీల్, తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ బలోపేతమే లక్ష్యంగా నల్లబెల్లి గ్రామ కమిటీ ఏర్పాటు

- నూతన గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా తాటికాయల దిలీప్ నియామకం



**వర్ధన్నపేట ప్రతినిధి, ఆగస్టు 4,తరంగాలు :** కాంగ్రెస్ పార్టీ బలోపేతమే లక్ష్యంగా నల్లబెల్లి గ్రామ కమిటీ ఏర్పాటు చేశారు.వర్ధన్నపేట ఎమ్మెల్యే కే.ఆర్. నాగరాజు ఆదేశాల మేరకు మండల అధ్యక్షుడు పొశాల వెంకన్న గౌడ్ ఆధ్వర్యంలో వర్ధన్నపేట మండలం నల్లబెల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీని ఎన్నుకున్నారు .నూతనంగా గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా తాటికాయల దిలీప్, ఉపాధ్యక్షుడిగా ముత్యం యాకయ్య, జనరల్ సెక్రటరీగా బిర్రు యాకయ్య, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఆరెల్లి నాగరాజులను నియమించారు.నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కమిటీ సభ్యులకు పలువురు నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ బలోపేతానికి నూతన కమిటీ సభ్యులు కృషి చేయాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమానికి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పోశాల వెంకన్న, ఐనవోలు దేవస్థానం చైర్మన్ కమ్మగోని ప్రభాకర్, ఇల్లంద మార్కెట్ చైర్మన్ నరకుడు వెంకన్న, జిల్లా ఉపాధ్యక్షులు, నాయకులు ఎద్దు సత్యనారాయణ, జక్కి గోపాల్, బిర్రు రాజు, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు పత్రి భాను ప్రసాద్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు దామర ప్రశాంత్ ముఖ్య అతిథులుగా హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.ఈ కార్యక్రమంలో నల్లబెల్లి గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ



**పర్వతగిరి, తరంగాలు(ఆగస్టు 04):** మండలంలోని గుగులోత్ తండా, మూడెత్తుల తండా గ్రామాలలో అనారోగ్యంతో ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందిన బాధితులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను స్థానిక సర్పంచులు లక్పతి,గమ్మి వీరన్నలతో కలిసి మండల కాంగ్రెస్ అధ్యక్షురాలు శ్రీమతి ఇస్లావత్ సావిత్రి పంపిణీ చేశారు. అనంతరం మూడెత్తుల తండా గ్రామం అంగన్‌వాడీ కేంద్రంలో పసిపిల్లలకు బాలామృతం,పౌష్టిక ఆహారం పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు మూడు దేవరాజ్, అంగన్‌వాడీ ఉపాధ్యాయురాలు,మహిళలు, గ్రామ శాఖ అధ్యక్షులు, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు మరియు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు

## వరంగల్ జిల్లా అభివృద్ధి, మౌలిక వసతుల విస్తరణ, పారిశ్రామిక ప్రగతి పై ప్రశ్నించిన ఎంపీ కడియం కావ్య



**న్యూఢిల్లీ, ఆగస్టు 4,తరంగాలు** :వరంగల్ జిల్లా అభివృద్ధి, మౌలిక వసతుల విస్తరణ, పారిశ్రామిక ప్రగతికి సంబంధించి వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య లోక్‌సభలో ప్రశ్నించారు. పీఎం గతిశక్తి, ఆస్పిరేషనల్ బ్లాక్స్ ప్రోగ్రామ్, ఇతర కేంద్ర పథకాల కింద వరంగల్‌కు ప్రత్యేక అభివృద్ధి ప్రణాళిక ఉందా? ఉంటే ఏయే ప్రాజెక్టులు మంజూరయ్యాయి? వాటి ద్వారా జిల్లాకు ఎలాంటి ప్రయోజనాలు కలగనున్నాయో వెల్లడించాలని కేంద్ర ప్రభుత్వాన్ని వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య కోరారు.వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య అడిగిన ప్రశ్నకు కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. వరంగల్ జిల్లాలో కనెక్టివిటీ మెరుగుపర్చేందుకు సుమారు రూ.7,843 కోట్ల వ్యయంతో 447 కిలోమీటర్ల మేర మూడు రైల్వే ప్రాజెక్టులు, రూ.6,133 కోట్ల వ్యయంతో 185 కిలోమీటర్ల మేర నాలుగు జాతీయ రహదారి ప్రాజెక్టులకు ఆమోదం లభించింది. అలాగే పీఎం మిత్ర పథకం కింద 1,327 ఎకరాల్లో ఏర్పాటు చేస్తున్న బ్రౌన్‌ఫీల్డ్ టెక్స్‌టైల్ పార్క్‌కు సుమారు రూ.1,696 కోట్ల వ్యయం కేటాయించినట్లు పేర్కొంది.ఈ సందర్భంగా వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య మాట్లాడుతూ,వరంగల్ అభివృద్ధికి సంబంధించి కేంద్రం వద్ద ఉన్న ప్రణాళికలు, నిధుల కేటాయింపులు, అమలులో ఉన్న ప్రాజెక్టులపై స్పష్టత కోరినట్లు వెల్లడించారు. రైల్వే, జాతీయ రహదారులు, టెక్స్‌టైల్ పార్క్ వంటి ప్రాజెక్టులు పూర్తయితే జిల్లాలో పారిశ్రామిక వృద్ధి, ఉపాధి అవకాశాలు గణనీయంగా పెరుగుతాయి" అని ఎంపీ తెలిపారు.అలాగే, వరంగల్‌కు మంజూరైన ప్రాజెక్టులు వేగంగా పూర్తయ్యేలా కేంద్రంపై నిరంతరం ఒత్తిడి తీసుకువస్తానని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన అభివృద్ధి పనులు కాగితాలకే పరిమితం కాకుండా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వం పైన ఉంది అని కడియం కావ్య పేర్కొన్నారు.

## మృతుల కుటుంబాలను పరామర్శించిన మార్నేని రవీందర్ రావు



**ఐనవోలు, ఆగస్టు 4, తరంగాలు** : ఐనవోలు మండల కేంద్రంలో ఇటీవల మృతి చెందిన రెండు కుటుంబాలను మాజీ టిస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు పరామర్శించి, కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.ఆవునూరి రమేష్, ఆవునూరి శంకర్‌ల తల్లి ఆవునూరి ఓదమ్మ, అలాగే కొండేటి యాకయ్య తల్లి కోరుమల్లమ్మ మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులను మాజీ టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు పరామర్శించారు. మృతుల కుటుంబాలకు ధైర్యం చెప్పి, ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ బరిగెల భాస్కర్, మాజీ సర్పంచ్ జన్ను కుమారస్వామి, నందనం సొసైటీ డైరెక్టర్ చింత బాబు, గడ్డం రమేష్, రహీం పాషా, ఏలియా సంపత్ రెడ్డి, వార్డు సభ్యులు అఖిల, బాబు, కుమారస్వామి, అనుముల రవి, మాజీ వార్డు సభ్యుడు శ్రీను, సమ్మయ్య, ఒంటిమామిడిపల్లి మాజీ ఎంపీటీసీ తిరుపతి తదితరులు పాల్గొన్నారు.



# కేజీబీవీలో వసతులు మెరుగ్గా ఉండాలి





**హనుమకొండ జిల్లా ఇన్చార్జి కలెక్టర్ ఎన్. రవి**

**హనుమకొండ ప్రతినిధి, ఆగస్టు 4,తరంగాలు** : కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం( కేజీబీవీ )లో వసతులు మెరుగ్గా ఉండాలని హనుమకొండ జిల్లా ఇన్చార్జి కలెక్టర్ ఎన్. రవి అన్నారు.మంగళవారం హనుమకొండ జిల్లా ఐనవోలు మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని జిల్లా ఇన్చార్జి కలెక్టర్ సందర్శించారు.ఈ సందర్భంగా వంట గదిలో విద్యార్థినులకు భోజనం వడ్డిస్తుండగా ఇన్చార్జ్ కలెక్టర్ పరిశీలించారు. భోజనం ఎలా ఉందని ఆరా తీశారు. విద్యార్థినులతో చదువుల గురించి మాట్లాడి తెలుసుకున్నారు. అధికారులతో కలిసి అక్కడే భోజనం చేశారు. ఆర్వో వాటర్ ప్లాంట్, కూరగాయలను పరిశీలించారు. విద్యాలయానికి సంబంధించిన విషయాలను ప్రత్యేక అధికారి సునీతను ఇన్చార్జి కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా ఇన్చార్జి కలెక్టర్ రవి మాట్లాడుతూ విద్యార్థినులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వసతులు కల్పించాలన్నారు.ఈ సందర్భంగా తహసిల్దార్ విక్రమ్ కుమార్, ఎంపీడీవో నర్మద, మండల వ్యవసాయ అధికారి సునీల్, తదితరులు పాల్గొన్నారు.



# ఎన్‌హెచ్-163పై రోడ్డు భద్రత పనులు వెంటనే పూర్తి చేయాలి

- ఎన్‌హెచ్ఏ అధికారికి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి విజ్ఞప్తి



**యాదాద్రి భువనగిరి జిల్లా, ఆగస్టు 4 (తరంగాలు ప్రతినిధి** ): భువనగిరి నియోజకవర్గ పరిధిలోని ఎన్‌హెచ్-163 జాతీయ రహదారిపై రోడ్డు భద్రతా పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి కోరారు.మంగళవారం ఎన్‌హెచ్ఏ చీఫ్ జనరల్ మేనేజర్ (టెక్నికల్), రీజినల్ ఆఫీసర్ శివశంకర్‌ను ఆయన కార్యాలయంలో కలిసి సమస్యలను వివరించారు. సింగన్నగూడెం క్రాస్‌రోడ్, రామకృష్ణాపురం, అనంతారం గ్రామ క్రాస్‌రోడ్ల వద్ద అండర్‌పాస్‌లు, సర్వీస్ రోడ్లు ఏర్పాటు చేయాలని కోరారు.ఈ ప్రాంతాల్లో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నందున ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకొని ప్రతిపాదిత పనులకు అవసరమైన అనుమతులు మంజూరు చేసి, ప్రాధాన్యతా ప్రాతిపదికన పనులను వెంటనే ప్రారంభించాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు

# బలమైన భవిష్యత్తుకు తల్లి పాలే పునాది

- డబ్బా పాలు వద్దు- తల్లిపాలే ముద్దు
- పుట్టిన బిడ్డకు ముర్రుపాలే సంపూర్ణ పోషకాలు
- ఘనంగా తల్లిపాల వారోత్సవాలు
- సర్పంచ్ ధరావత్ కైక.




**కేసముద్రం,మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి ఆగస్టు.04, తరంగాలు:** మండలంలోని క్యాంపు తండాగ్రామపంచాయతీ పరిధి మాత్రు తండా అంగన్వాడి కేంద్రంలో మంగళవారం అంగన్వాడీ టీచర్ తిరునగరి వాణి ఆధ్వర్యంలో ఘనంగా తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ధరావత్ కైక,ఐసిడిఎస్ సూపర్వైజర్ సంధ్యారాణి పాల్గొని మాట్లాడుతూ.. బలమైన భవిష్యత్తుకు తల్లి పాలే పునాది లాంటివని పుట్టిన బిడ్డకు ముర్రుపాలే సంపూర్ణ పోషకాలని ప్రతి సంవత్సరం ఆగస్టు ఒకటి నుండి వారం రోజులపాటు అంతర్జాతీయ తల్లిపాల వారోత్సవాలు జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుందన్నారు. తల్లి బిడ్డకు ముర్రు పాలు పట్టించడం ద్వారా వ్యాధి నిరోధక శక్తి పెరిగి శిశువుకు రోగాలు దరిచేరవని సరైన అవగాహన లేని కారణంగా ముర్రు పాలు బిడ్డకు తాపించకపోవడంతో త్వరగా వ్యాధి బారిన పడే ప్రమాదం ఉంటుందని బిడ్డకు తల్లి పాలు ఇవ్వడం వల్ల తల్లికి రొమ్ము క్యాన్సర్ రాదన్నారు. తల్లిపాలలో ఖనిజాలు, మాంసకృతులు, విటమిన్- ఏ సమృద్ధిగా ఉంటాయని పిల్లలకు అస్తమా మలబద్ధకం రాకుండా ఉంటాయని వివరించారు. ఇప్పుడే పుట్టిన బిడ్డ నుండి ఆరు నెలల వరకు తల్లిపాలే పట్టించాలని డబ్బా పాలు వద్దు తల్లిపాలే ముద్దు అని తల్లి బిడ్డకు పాలు ఇవ్వడం వలన తల్లికి మానసిక ఒత్తిడి రక్తస్రావం తగ్గుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ దరావత్ శేఖర్, మాజీ ఎంపీటీసీ దరావత్ రవి,పంచాయతీ కార్యదర్శి మనోజ్,అంగన్వాడి టీచర్లు తిరునగరి వాణి, బానోత్ స్వప్న, గుగులోత్ నీల, పాఠశాల ఉపాధ్యాయులు ఉపేందర్ బాలింతలలు, అంగన్వాడి పిల్లలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రుల్లో సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలి





- హనుమకొండ జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ఎన్. రవి

**హనుమకొండ ప్రతినిధి , ఆగస్టు 4, తరంగాలు :** ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సాధారణ ప్రసవాల సంఖ్య పెరిగేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని హనుమకొండ జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ఎన్. రవి వైద్యాధికారులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలను ఆదేశించారు.మంగళవారం హనుమకొండ జిల్లా ఐనవోలు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఇన్‌చార్జి కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో అందిస్తున్న వైద్య సేవలు, మౌలిక వసతులు, మందుల నిల్వలు, రోగులకు అందుతున్న సేవలపై క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా ఓపీ రిజిస్టర్‌ను పరిశీలించిన కలెక్టర్, ప్రతిరోజు ఎంతమంది రోగులు చికిత్స పొందుతున్నారనే వివరాలను మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీదేవిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం మందులు, వైద్య సామగ్రి నిల్వ ఉంచిన స్టోర్‌రూమ్‌ను పరిశీలించి, అవసరమైన మందులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆసుపత్రిలో పరిశుభ్రత, రోగులకు అందుతున్న వైద్య సేవలపై వైద్యులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు.ఆరోగ్య స్వస్థత కేంద్రంలో ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలతో సమావేశమైన కలెక్టర్, ఆరోగ్య కేంద్రం పరిధిలో ఇప్పటివరకు జరిగిన సాధారణ ప్రసవాల సంఖ్య, గర్భిణులకు అందిస్తున్న సేవలు, అవగాహన కార్యక్రమాలపై వివరాలు తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఇన్‌చార్జి కలెక్టర్ ఎన్. రవి మాట్లాడుతూ, గర్భిణులను ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ప్రసవాలకు ప్రోత్సహించేలా విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. అవసరం లేని సిజేరియన్ ప్రసవాలు తగ్గించి, సాధారణ ప్రసవాలను ప్రోత్సహించడం ద్వారా తల్లి, శిశువు ఆరోగ్యాన్ని కాపాడడంతో పాటు కుటుంబాలపై ఆర్థిక భారం కూడా తగ్గుతుందని పేర్కొన్నారు.ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సాధారణ ప్రసవాల సంఖ్యను పెంచేందుకు ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. సాధారణ ప్రసవాలను అత్యధికంగా ప్రోత్సహించిన ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలను ప్రోత్సాహక అవార్డులతో సత్కరించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా పనిచేయాలని వైద్య సిబ్బందికి సూచించారు.ఈ తనిఖీలో స్థానిక తహసీల్దార్ విక్రమ్ కుమార్, వైద్యాధికారులు, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ఎన్‌హెచ్-163పై అసంపూర్తి సర్వీస్ రోడ్లను వెంటనే పూర్తి చేయాలి

- వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య






**న్యూఢిల్లి, ఆగస్టు 4,తరంగాలు** :యాదాద్రి--వరంగల్ మధ్య జాతీయ రహదారి-163పై అసంపూర్తిగా ఉన్న సర్వీస్ రోడ్ల నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య కోరారు. మంగళవారం న్యూఢిల్లీలో జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) చైర్మన్ సంతోష్ కుమార్ యాదవ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం సమర్పించి సమస్యను వివరించారు.

ఈ సందర్భంగా వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య మాట్లాడుతూ, హైదరాబాద్--భూపాలపట్నం జాతీయ రహదారి (ఎన్‌హెచ్-163)లోని యాదాద్రి--వరంగల్ నాలుగు లేన్ల విస్తరణ పనుల సమయంలో నిడిగొండ, రఘునాథపల్లి, చాగల్, స్టేషన్ ఘన్‌పూర్, చిన్నపెండ్యాల, కరుణాపురం గ్రామాల పరిధిలో సర్వీస్ రోడ్లు నిర్మించినప్పటికీ, వాటి మధ్య పలు ప్రాంతాల్లో అనుసంధాన లింకులు మిగిలిపోయాయని తెలిపారు.జనగాం సమీపంలోని. 87/200 కి.మీ నుంచి నిడిగొండ వరకు, నిడిగొండ నుంచి రఘునాథపల్లి వరకు, రఘునాథపల్లి నుంచి చాగల్ వరకు, చాగల్ నుంచి స్టేషన్ ఘన్‌పూర్ వరకు, స్టేషన్ ఘన్‌పూర్ నుంచి చిన్నపెండ్యాల వరకు, చిన్నపెండ్యాల నుంచి కరుణాపురం వరకు ఉన్న సర్వీస్ రోడ్లలో లింకులు లేకపోవడం వల్ల స్థానిక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య వివరించారు.ఈ కారణంగా స్థానిక వాహనాలు ప్రధాన జాతీయ రహదారిపైకి రావాల్సి వస్తోందని, దీంతో ట్రాఫిక్ రద్దీ పెరగడంతో పాటు రోడ్డు ప్రమాదాలు అధికమవుతున్నాయని ఎంపీ పేర్కొన్నారు. నాలుగు లేన్ల విస్తరణ సమయంలోనే సర్వీస్ రోడ్ల నిర్మాణానికి అవసరమైన భూమి సేకరణ పూర్తయినందున, మిగిలిన లింకులను నిర్మించడంలో ఎలాంటి ఇబ్బందులు ఉండవని తెలిపారు.ప్రజల భద్రత, స్థానిక రవాణా సౌలభ్యం, గ్రామాల మధ్య మెరుగైన అనుసంధానం కోసం అసంపూర్తిగా ఉన్న సర్వీస్ రోడ్ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య ఎన్‌హెచ్ఏఐ చైర్మన్‌ను కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన చైర్మన్ సంబంధిత అధికారులతో సమీక్షించి తగిన చర్యలు చేపడతామని హామీ ఇచ్చినట్లు ఎంపీ తెలిపారు.

# ఉధృతంగా ప్రవహిస్తున్న మూసి వరద



**యాదాద్రి భువనగిరి జిల్లా ఆర్సి ఆగస్టు 4 తరంగాలు** వలిగొండ మండల పరిధిలోని సంగెం భీమలింగం కత్వా వద్ద రాకపోకలకు అంతరాయం, హైదరాబాదులో ఇటీవల కురుస్తున్న వర్షానికి బొల్లెపల్లి -- సంగెం మధ్య లెవల్ బ్రిడ్జిపైకి వరదనీరు, బ్రిడ్జిపై నుంచి ప్రవహిస్తున్న మూసి వరద,రాకపోకలు పూర్తిగా నిలిపివేసిన అధికారులు,బ్రిడ్జికి ఇరువైపులా బారికేడ్లు ఏర్పాటు చేసిన పోలీసులువాహనదారులు ,ప్రత్యామ్నాయ మార్గాలు వినియోగించాలంటున్న పోలీసులు,ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారుల ప్రయాణికులు వాహనదారులు వేర్వేరు మార్గాల ద్వారా ప్రయాణించాలని తెలియజేశారు

# కాంగ్రెస్ మార్క్ 'యూత్ డిక్లరేషన్'
## నిరుద్యోగుల పాలిట 'మరణ శాసనం'గా మారింది

- బీఆర్ఎస్ నాయకులు ఏనుగుల రాకేష్ రెడ్డి ధ్వజం.



**తరంగాలు ఖమ్మం జిల్లా బ్యూరో :** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి నిరుద్యోగులను నమ్మిస్తూ, మోసం చేస్తోందని, ఎన్నికల ముందు వారు ప్రకటించిన 'యూత్ డిక్లరేషన్' ఈరోజు నిరుపయోగంగా (యుస్‌లెస్) మారి నిరుద్యోగుల పాలిట మరణ శాసనంగా పరిణమించిందని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు ఏనుగుల రాకేష్ రెడ్డి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు.మధిర నియోజకవర్గానికి చెందిన నిరుద్యోగి, ఉద్యోగం రాక తీవ్ర మనస్తాపంతో సూసైడ్ యత్నం చేసిన గడ్డం వేణు గౌడ్‌ను పరామర్శించిన అనంతరం, ఖమ్మం జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం "తెలంగాణ భవన్"లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు.వేణు గౌడ్ ఆవేదన.. రాష్ట్ర నిరుద్యోగుల గుండెకోత : ఏళ్ల తరబడి ప్రిపేర్ అవుతున్నా సరైన జాబ్ క్యాలెండర్ లేకపోవడం,ఉద్యోగాలు రాకపోవడంతో తన పేదరికాన్ని జయించలేక, కుటుంబాన్ని కాపాడుకోలేక తీవ్ర నిరాశా నిస్పృహలతో గడ్డం వేణు గౌడ్ సూసైడ్ కమిట్ చేసుకోవడం అత్యంత బాధాకరమని రాకేష్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు.వేణు రాసిన మూడు పేజీల సూసైడ్ నోట్ కేవలం అతని ఒక్కడి ఆవేదన కాదని,తెలంగాణలోని లక్షలాది మంది నిరుద్యోగుల గుండెల్లో మండుతున్న ఆక్రోశమని స్పష్టం చేశారు. ప్రభుత్వం భయపడి ఆ సూసైడ్ నోట్‌లోని పుటలను బయటకు రాకుండా తొక్కుతోందని, చివరకు ప్రేమ వ్యవహారమని చిత్రించి తప్పుదోవ పట్టించే కుట్ర చేస్తోందని మండిపడ్డారు.గ్యారెంటీ కార్డులకు వారంటీ లేదు.. హామీలన్నీ నీటిమూటలే!ఎన్నికల ముందు ఆరు గ్యారెంటీలు, యూత్ డిక్లరేషన్ అంటూ ఊరూరా తిరిగి బాండ్ పేపర్లు పంచిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, సీఎం రేవంత్ రెడ్డిలు ఇప్పుడు ఆ హామీలను గాలికొదిలేశారని విమర్శించారు.ఏడాదికి 2 లక్షల ఉద్యోగాలు ఏవయ్యాయి? మెగా డిఎస్సీ జాడ ఏది? జాబ్ క్యాలెండర్, నిరుద్యోగ భృతి, జీవో 46 రద్దు హామీలు ఏమయ్యాయి?బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఫీజుల పేరిట విమర్శలు చేసిన కాంగ్రెస్ నాయకులు, నేడు కానిస్టేబుల్, ఎస్ఐ అప్లికేషన్లకు రూ. 1000 నుండి రూ. 1500 వరకు వసూలు చేస్తూ నిరుద్యోగుల రక్తాన్ని పిండుకుంటున్నారని ఆరోపించారు. కమిషన్ల ప్రభుత్వం పేదలకు అందని ఇండ్లు

ప్రభుత్వానికి కమిషన్లు వచ్చే బిల్లులు, కాంట్రాక్టులపై ఉన్న శ్రద్ధ నిరుద్యోగులకు నోటిఫికేషన్లు ఇవ్వడంపై లేదని రాకేష్ రెడ్డి ఎద్దేవా చేశారు.రాష్ట్ర హౌసింగ్ మినిస్టర్ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సొంత జిల్లాలోనే అత్యంత పేద కుటుంబానికి చెందిన వేణుకు కనీసం ఇల్లు కూడా మంజూరు కాలేదని, కేవలం సొంత పార్టీ వారికే ఇండ్లు ఇచ్చుకుంటున్నారని ఆరోపించారు. నిరుద్యోగులకు అండగా బీఆర్ఎస్ కేటీఆర్ భరోసా

కష్టాల్లో ఉన్న వేణును బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నేరుగా ఫోన్లో పరామర్శించి, ధైర్యం చెప్పారని తెలిపారు. నిరుద్యోగులెవ్వరూ ధైర్యం కోల్పోయి ఆత్మహత్యలకు పాల్పడవద్దని, ఉద్యోగ కల్పన, జాబ్ క్యాలెండర్ సాధించే వరకు బీఆర్ఎస్ పార్టీ ముందుండి పోరాడుతుందని కేటీఆర్ భరోసానిచ్చారని పేర్కొన్నారు."రగులుతుంది నిరుద్యోగి కాగడా.. విప్లవమై ఎగిసిపడుతుంది ప్రభుత్వ గుండెల నిండా! (గడ్డం వేణు గౌడ్ రాసిన కవిత నుండి..)ఆస్పత్రి యాజమాన్యంపై ఒత్తిడి తెచ్చి వేణును డిశ్చార్జ్ చేయించే కుట్ర ఆపాలని, అతనికి హైదరాబాద్‌లో అత్యుత్తమ వైద్యం అందించాలని, తక్షణ సాయంగా రూ. 5 లక్షలు ప్రకటించాలని, వేణు పేద కుటుంబానికి తక్షణమే పక్కా ఇల్లు మంజూరు చేయాలని, కేవలం 7,000 పోస్టులకే పరిమితం చేయకుండా, ఖాళీగా ఉన్న 19,000 పోస్టులకు నోటిఫికేషన్ సవరించాలని,. కానిస్టేబుల్, ఎస్ఐ అభ్యర్థులకు వయోపరిమితి (ఏజ్ రిలాక్సేషన్ ) సడలించాలని, ఇచ్చిన హామీ ప్రకారం తక్షణమే స్పష్టమైన జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని బిఆర్ఎస్ పార్టీ తరపున డిమాండ్ చేశారు.ఉత్తరాదిలో వచ్చిన 'జెన్ జీ' ఉద్యమంలా తెలంగాణలో కూడా నిరుద్యోగుల సునామీ రాబోతోందని, ఇదే ఖమ్మం జిల్లా నుండే కాంగ్రెస్ ప్రభుత్వం పతనానికి ఈ నిరుద్యోగుల ఆగ్రహమే మరణశాసనం అవుతుందని హెచ్చరించారు.మీడియా సమావేశం లో గూడా సంజీవ్ రెడ్డి, బలుసు మురళీకృష్ణ,మద్దెల విజయ కుమార్,ఈదుల రాజేష్,షారూక్, జడల కళ్యాణ్, సాయిదీప్, సాయి ప్రసాద్, తదితర నాయకులు పాల్గొన్నారు.

# వైరా మున్సిపాలిటీ కార్యాలయం వద్ద బీఆర్ఎస్ ధర్నా

- నీటి పన్ను వసూలు నిలిపివేయాలని డిమాండ్
- కౌన్సిల్ సమావేశం లేకుండా ఆన్‌లైన్ బిల్లులు ఇవ్వకుండా మాన్యువల్ బిల్లు ఇవ్వడంపై అభ్యంతరం
- స్పష్టమైన ఆదేశాలు వచ్చేంత వరకు నీటి పన్ను వసూలు చేయొద్దు



***తరంగాలు ఖమ్మం జిల్లా బ్యూరో :*** వైరా మున్సిపాలిటీ పరిధిలో గత కొంతకాలంగా వసూలు చేస్తున్న మంచినీటి పన్నుల బకాయిలు ఎలాంటి తీర్మానం లేకుండా సిబ్బంది ఇష్టారాజ్యంగా వసూలు చేస్తున్నారని ఆరోపిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మంగళవారం మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్, సిపిఐ, సిపిఎం కౌన్సిలర్లు కట్టా స్వరూప రాణి,తిరుపతి, శివకుమారి,చిలక చిన్న కోటయ్య, కిన్నెర కృష్ణ, మాదిరిని సునీత, దుర్గాప్రసాద్, నల్లమోతు శైలజ, జిల్లా నాయకులు కట్టా కృష్ణార్జున రావు, బాణాల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. మున్సిపాలిటీ ఏర్పడిన దగ్గర్నుండి సుమారు 8 సంవత్సరాల కాలంలో బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో మంచినీటి పనులు వసూళ్లు జరగలేదని, కానీ వైరా మున్సిపాలిటీ పరిధిలో సిబ్బంది మూడు సంవత్సరాల బిల్లును ఒకేసారి వసూలు చేస్తూ సామాన్య ప్రజలపై అధిక భారం మోపుతున్నారన్నారు. దీన్ని అరికట్టేందుకు మున్సిపల్ ఆఫీస్ ముందు ధర్నా నిర్వహిస్తున్నామని తెలిపారు.ఎలాంటి ఆన్‌లైన్ బిల్లులు లేకుండా కేవలం ఆఫ్ లైన్ ద్వారా బిల్లులు వసూలు చేయడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. కనీసం కౌన్సిల్ తీర్మానం లేకుండా త్రాగునీటి బిల్లులు ఎలా వసూలు చేస్తారని కమిషనర్‌ను వారు ప్రశ్నించారు. దీనికి కమిషనర్ స్పందిస్తూ.. ఆన్‌లైన్ బిల్లులు వచ్చేవరకు సిబ్బంది తాగునీటి బిల్లులు వసూలును తాత్కాలికంగా నిలిపివేస్తారని హామీ ఇచ్చారు. వారం రోజుల్లో కౌన్సిల్ సమావేశం నిర్వహించి తీర్మానం ప్రతిపాదిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ మాజీ అధ్యక్షుడు మద్దెల రవి, అప్పం సురేష్, పట్టణ మహిళా మాజీ అధ్యక్షురాలు బానోత్ సక్కుబాయి, నాయకులు మాదినేని దుర్గాప్రసాద్, నూకల వాసు, పుల్లయ్య, పాసంగులపాటి శివ, బత్తుల రాజు, కొత్త నరసింహారావు, మాచర్ల శంకర్, నరసింహారావు, కట్ట నాగేశ్వరరావు, వేముల శివకృష్ణ, రంజాన్, వదినేపల్లి చక్రవర్తి, గుగులోతు బాలు, వేరన్న, రేచర్ల సైదులు, వల్లెపు రాము పాల్గొన్నారు.

# వైభవంగా మండల సమైక్య
# 21వ వార్షిక మహాసభ






**కేసముద్రం,మహబూబాబాద్ జిల్లా,ప్రతినిధి, ఆగస్టు.04,తరంగాలు:** మంగళవారం కేసముద్రం సాధికారత మండల సమైక్య 21వ వార్షిక మహాసభ ను సమైక్య అధ్యక్షురాలు కుంట అమృత అధ్యక్షతన వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మండల వ్యవసాయ అధికారి వెంకన్న, ఏపీఓ హరీష్, హాజరయ్యారు.?ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి వెంకన్న మాట్లాడుతూ.. రైతులు సాంప్రదాయ పంటలకే పరిమితం కాకుండా పంట మార్పిడి పద్ధతులను పాటించాలని సూచించారు. నీటి ఎద్దడిని తట్టుకునే ఆరుతడి పంటలు, పప్పు దినుసులను విస్తృతంగా సాగు చేయాలని పిలుపునిచ్చారు. అలాగే ఆయిల్ పామ్ తోటల పెంపకంపై దృష్టి సారించాలని, భూగర్భ జలాల పెంపకు ప్రతి రైతు తమ పొలాల్లో పంట కుంటలు (ఫార్మ్ పాండ్స్) తవ్వుకోవాలని అవగాహన కల్పించారు.?అనంతరం ఎంపీఓ హరీష్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఇళ్లలో చేరే చెత్తను తడి, పొడి, హానికర, ఇతర చెత్తగా వర్గీకరించి నాలుగు రంగుల డబ్బాలలో విడివిడిగా గ్రామపంచాయతీ సిబ్బందికి అందించాలని తెలిపారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడంతో పాటు ప్రతి ఇంటికీ ఇంకుడు గుంతను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.?ఈ మహాసభలో ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ కోఆర్డినేటర్ అరుణ, ఆర్ఎం మధుసూదన్, బాలల హక్కుల పరిరక్షణ విభాగం ప్రతినిధి ప్రభు, కేసముద్రం ఏపీఎం తోటకూరి కృష్ణమూర్తి, ఎంఎస్ కార్యదర్శి రమాజ్యోతి, కోశాధికారి ఉమా, సీసీలు వెంకటనారాయణ, వెంకటేశ్వర్లు, వెంకటయ్య, నలిని, మంజుల, వివిధ గ్రామ సంఘాల లీడర్లు తదితరులు పాల్గొన్నారు

# రహదారి తొలగింపు పై అపోహలు నమ్మకండి

- బాలాజీ నగర్ సర్పంచ్ పాయం స్వాతి



**ఇల్లందు ప్రతినిధి ఆగస్టు 4, ( తరంగాలు)** : ఇల్లందు మండలం బాలాజీ నగర్ పంచాయతీలో గ్రామసభ నిర్వహించిన అనంతరం సర్పంచ్ పాయం స్వాతి మాట్లాడుతూ, గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో పంచాయతీ రహదారి పక్కన ఇంటిగ్రేడ్ మార్కెట్ నిర్మాణం లో భాగంగా కాంట్రాక్టర్ 50 అడుగుల పొడవు 15 ఫీట్ల లోతు నుయ్యి తీసి వెళ్లడం జరిగిందని తెలిపారు. ఆ నుయ్యి ప్రక్కన రహదారి ఉండటంతో నడిచి వెళ్లే పాదచారులు, స్కూల్ పిల్లలు, ద్విచక్ర వాహనదారులకు ప్రమాదకరంగా తయారైందన్నారు.రాత్రి వేళలో ఈ రహదారి గుండా ప్రయాణించే సమయంలో కనురెప్ప చాటులో ప్రమాదం జరిగే అవకాశం ఎక్కువగా ఉన్నందున ఇట్టి విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందని తెలిపారు. వెంటనే ఎమ్మెల్యే స్పందించి ఆ నుయ్యి పూడ్చేసేందుకు సింగరేణి జి.ఎం తో మాట్లాడి మట్టి ఏర్పాటు చేశారని దానిలో భాగంగా మట్టిని రహదారిపై పోయాల్సి వచ్చిందన్నారు. పంచాయతీ అభివృద్ధిని జీర్ణించుకోలేక కొందరు కావాలని ఈ విషయాన్ని భూతద్దంలో పెట్టి చూస్తూ రహదారి మోసేస్తున్నారని ప్రజలను పక్కదారి పట్టిస్తున్నారని అన్నారు. అలాంటి వారి పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉంటూ,వారిని గమనించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రహదారి మూసి వేస్తారనే అపోహాలు నమ్మరాదని తెలిపారు.

# స్నేహబంధానికి ఆషాఢం అందాలు

- అక్షయ మహిళా సంఘము ఆధ్వర్యంలో ఫ్రెండ్‌షిప్ డే గాజుల వేడుకలు ఘనం





**కేసముద్రం,మహబూబాబాద్ జిల్లా, ప్రతినిధి,ఆగస్టు. 0 4,తరంగాలు:** అర్పణపల్లిలో మహిళల సందడి.. కేక్ కటింగ్‌తో వేడుకలు.. చిన్నారుల సందడితో పండుగ వాతావరణం మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం అర్పణపల్లి గ్రామంలో అక్షయమహిళా సంఘము ఆధ్వర్యంలో ఫ్రెండ్‌షిప్ డేతో పాటు ఆషాఢం గాజుల వేడుకలను మహిళలు అత్యంత ఘనంగా నిర్వహించారు. అక్షయ సమైక్య మహిళా సంఘం సీఏ గంధసిరి లావణ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమం ఆనందోత్సాహాల నడుమ సాగింది.ఈ వేడుకల్లో భాగంగా మహిళలు ఒకరికొకరు గాజులు తొడిగించుకుంటూ ఆషాఢ మాస విశిష్టతను చాటారు. అనంతరం ఫ్రెండ్‌షిప్ డే సందర్భంగా కేక్ కట్ చేసి పరస్పరం శుభాకాంక్షలు తెలియజేసుకుంటూ స్నేహబంధాన్ని మరింత బలోపేతం చేసుకున్నారు. మహిళల నవ్వులు, ఆప్యాయతలు, సందడితో కార్యక్రమ ప్రాంగణం పండుగ వాతావరణాన్నిసంతరించుకుంది.కార్యక్రమానికి హాజరైన చిన్నారులు ఆటపాటలు, ఉత్సాహంతో వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. మహిళల ఐక్యత, స్నేహం, పరస్పర సహకారాన్ని పెంపొందించే ఇటువంటి కార్యక్రమాలు సమాజానికి ఆదర్శంగా నిలుస్తాయని నిర్వాహకులు పేర్కొన్నారు.ఈ సందర్భంగా సీఏ లావణ్య మాట్లాడుతూ, మహిళలు అన్ని రంగాల్లో ముందుకు సాగడంతో పాటు సంప్రదాయాలను, సాంస్కృతిక విలువలను కాపాడాలని, ఇలాంటి కార్యక్రమాలు మహిళల్లో ఆత్మవిశ్వాసం, ఐక్యతను పెంపొందిస్తాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో అక్షయ మహిళా సంఘం సభ్యులు, గ్రామ మహిళలు, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

# తడి చెత్త పొడి చెత్త పై ప్రజలకు అవగాహన

**జఫర్గడ్ ప్రతినిధి, ఆగష్టు 4,(తరంగాలు):**మండలం లోని షాపెల్లి గ్రామంలో గ్రామపంచాయతీ ఆవరణలో గ్రామసభ నిర్వహించడం జరిగింది. అదేవిదంగా తడి చెత్త పొడి చెత్త పై గ్రామప్రజలకు ఇంటింటికి వెళ్లి చెత్త వేరు చేసే విధానం వివరించడం జరిగింది. ఈ కార్యక్రమం లో సర్పంచ్ తాళ్లపెల్లి సుభాష్ చంద్రబోస్, ఉపసర్పంచ్ మమత, కార్యదర్శి చలపతి,వార్డ్ సభ్యులు మహమ్మద్ ముస్తఫా, తాళ్లపెల్లి వెంకన్న, గ్రామస్తులు పాల్గొన్నారు.



## మెటీరియల్ ఉపయోగించుకుంటేనే అభివృద్ధి

•సర్పంచ్ ఝూన్సీ నరేష్




**కేసముద్రం,మహబూబాబాద్ జిల్లా,ప్రతినిధి,ఆగస్టు. 04,తరంగాలు:**ప్రభుత్వం పంపిణీ చేసిన మెటీరియల్ సక్రమంగా ఉపయోగించుకొని ప్రీ ప్రైమరీ పిల్లలు అభివృద్ధి చెందాలని పీక్ల తండా సర్పంచ్ గుగులోత్ ఝూన్సీ నరేష్ అన్నారు.మంగళవారం ఎంపీపీ ఎస్ బోడగుట్ట తండా ప్రీ ప్రైమరీ పాఠశాలలో విద్యార్థులకు షూ, డ్రాయింగ్ బుక్స్, బ్యాగులు, పెన్సిల్లు, ఇతర స్టడీ మెటీరియల్ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో బాగా చదువుకొని పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలన్నారు.విద్యార్థులను పలు అంశాల్లో పరిశీలించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు గనె యాదగిరి, ఉపాధ్యాయురాలు పల్నాటి స్వప్న, ప్రీ ప్రైమరీ ఇన్స్ట్రక్టర్ గుగులోతు మైబు, గుగులోతు శిరీష, అంగన్వాడి టీచర్ గుగులోతు నీల, ఉప సర్పంచ్ గుగులోతు రవి, గూగులోత్ నరేష్ నాయక్, ప్రజా ప్రతినిధులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఘనంగా ఖమ్మంలో హెచ్ ఆర్సి సిఐ జిల్లా కార్యాలయం ప్రారంభోత్సవం



**తరంగాలు ఖమ్మం జిల్లా బ్యూరో :** మానవ హక్కుల పరిరక్షణ సంస్థ ఖమ్మం జిల్లా నూతన కార్యాలయం జిల్లా చైర్మన్ పుచ్చకాయల దేవేందర్,సెక్రటరీ చింతల రవి,అధ్యక్షతన ఖమ్మం నగరంలోని ఎన్టీఆర్ సర్కిల్ ఇద్దరు ఇల్లందు రోడ్డు వద్ద ఘనంగా ప్రారంభోత్సవం జరిగింది, ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హెచ్ఆర్సీసీ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షులు సింగమల వెంకటరమణయ్య హాజరై వారి చేతుల మీదుగా మంగళవారం కార్యాలయ ప్రారంభోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి హెచ్ఆర్సీసీఐ తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యులు తెలంగాణ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ కిషోర్ కుమార్,వర్కింగ్ చైర్మన్ బెస్త సంజీవరావు, జనరల్ సెక్రటరీ మోటపోతుల బాబురావు, రాష్ట్ర మహిళా చైర్మన్ పాదం అజంతా,సెక్రెటరీ సంకా గణేష్ కుమార్, హాజరై మాట్లాడారు, అనంతరం సంస్థ ఫౌండర్ రమణయ్య మాట్లాడుతూ... ఖమ్మం జిల్లాలో హ్యూమన్ రైట్స్ కార్యాలయాన్ని భారీ ఎత్తున ప్రారంభించినందుకు కమిటీ సభ్యులతో సంతోషం వ్యక్తం పరిచారు. సంస్థలో చేరదలిచే వారు లాభార్జన కోసం కాదని సేవ చేసే గుణం ఉంటేనే కమిటీ సభ్యులుగా చేరాలని అన్నారు. సంస్థ యొక్క నిబంధనలను తూచా తప్పకుండా పాటించాలని, విధివిధానాలను గూర్చి క్లుప్తంగా వివరించారు,ఖమ్మం జిల్లా కమిటీ సభ్యులు చైర్మన్ పుచ్చకాయల దేవేందర్,జనరల్ సెక్రటరీ చింతల రవి, చిలకబత్తిన కనకయ్య, సయ్యద్ షారుక్ ఇమ్రాన్,కొప్పుల రామకృష్ణ వర ప్రసాద్, గుర్రం మనోజ్,నవీన్,నాగేశ్వరరావు,కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.ఈ కార్యక్రమంలో బొమ్మల శంకర్, అవినాష్, సుధాకర్,
ఈ కార్యక్రమ నిర్వాహకులు పాల్గొన్నారు.

## ఈవీఎం గోడౌన్ భద్రతపై నిరంతర పర్యవేక్షణ అవసరం: కలెక్టర్ అంకిత్



**భద్రాద్రి జిల్లా బ్యూరో తరంగాలు న్యూస్ ఆగస్టు 4**

కొత్తగూడెం, ఆగస్టు 4: కొత్తగూడెం ఆర్డీవో కార్యాలయ ప్రాంగణంలోని ఈవీఎం గోడౌన్ను జిల్లా కలెక్టర్ అంకిత్ మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఈవీఎంలు, వీవీప్యాట్ల భద్రత ఎన్నికల ప్రక్రియలో అత్యంత కీలకమని పేర్కొంటూ, భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు అన్ని భద్రతా ప్రమాణాలను కచ్చితంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. స్ట్రాంగ్ రూమ్, సీసీ కెమెరా వ్యవస్థ, విద్యుత్ బ్యాకప్, భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్, గోడౌన్ వద్ద సిబ్బంది ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని, అనుమతి లేని వ్యక్తులను లోనికి అనుమతించరాదని సూచించారు. అనంతరం తనిఖీ రిజిస్టర్లో సంతకం చేశారు.

# బాధితుల ఇంటికే సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు





•ఎమ్మెల్యే కోరం కనకయ్య ఆధ్వర్యంలో లబ్ధిదారులకు ఆర్థిక భరోసా

**ఇల్లందు ప్రతినిధి, ఆగస్టు 4 (తరంగాలు):**
ప్రజల సమస్యలను తెలుసుకుని వారికి అవసరమైన సమయంలో ప్రభుత్వం అండగా నిలవడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. ఇల్లందు మండలంలో సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరైన చెక్కులను ఎమ్మెల్యే స్వయంగా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి అందజేశారు.ఇందులో భాగంగా బాలాజీనగర్ గ్రామపంచాయతీలో సర్పంచ్ పాయం స్వాతి ఆధ్వర్యంలో పలువురు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లిన ఎమ్మెల్యే కోరం కనకయ్య వారికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య తెలంగాణలో ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ప్రజల సమస్యలను తెలుసుకుని, అవసరమైన సహాయాన్ని సమయానుసారం అందించడం ప్రజల పట్ల తమ కర్తవ్యమని పేర్కొన్నారు.సీఎం సహాయనిధి ద్వారా అనేక కుటుంబాలు ఆర్థిక ఇబ్బందుల నుంచి బయటపడుతున్నాయని ఎమ్మెల్యే తెలిపారు. ఆపదలో ఉన్న కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ఫలాలు అందేలా కృషి చేస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మండల రాము, సర్పంచ్ పాయం స్వాతి, ఉప సర్పంచ్ ఈశ్వరమ్మ, వార్డు సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పులి సైదులు, చాంద్ పాషా, విజయ్, కల్తీ పద్మ, రేపల్లెవాడ సర్పంచ్ శారద, భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

# అస్తవ్యస్తంగా డ్రైనేజీ వ్యవస్థ

## పట్టించుకోని గ్రామపంచాయతీ పాలక వర్గం





సిపిఎం మండల కమిటీ సభ్యులు కాట సుధాకర్

**జఫర్గడ్ ప్రతినిధి, ఆగస్టు 4,(తరంగాలు ):**జఫర్గడ్ గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని సిపిఎం మండల కమిటీ కాట సుధాకర్ పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రసిపిఎం పార్టీ ఆధ్వర్యంలో స్థానిక సమస్యలపై సర్వే చేయడం జరిగింది. ఈ సర్వే సందర్భంగా సిపిఎం పార్టీ మండల నాయకులు కాట సుధాకర్ మాట్లాడుతూ గ్రామంలో డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉంది .దేనితోపాటు పెన్షన్స్ గత పది సంవత్సరాలుగా పదేపదే దరఖాస్తులు పెట్టిన ఇప్పటివరకు పెన్షన్స్ రావడం లేదు. పేదరికంలో మగ్గుతూ ఇల్లు కట్టుకోలేని స్థితిలో ఉన్న కుటుంబాలకు ప్రభుత్వమే ఇందిరమ్మ ఇండ్లు కట్టివ్వాలని డిమాండ్ చేశారు. వర్షాకాలం కావడం వల్ల గ్రామంలో విపరీతంగా దోమలు ఉండడంవల్ల ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారు. గ్రామంలో దోమల మందు స్ప్రే చేయాలని అన్నారు. అంతర్గత గుంతలుగా ఏర్పడి నీరు నిల్వ ఉన్నచోట మొరంపోసి ,నీరు నిలవ లేకుండా చేయాలి. ఉపాధి హామీ కార్యక్రమం లో భాగంగా మొక్కలు నాటుతున్నారు. కరెంటు లైన్ల కింద నాటడం వల్ల ఉపయోగం లేదు. కరెంటు లైన్ ఉన్నచోట కాకుండా కరెంటు లైన్లు లేనిచోట నాటితే బాగుంటుందని సూచించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ టౌన్ కార్యదర్శి సాకి నరసింగం, మండల నాయకులు నల్లతీగల శ్రీనివాస్ ,గ్రామ నాయకులు ఎల్మకంటి సుధాకర్, వెంకటేష్, చిరంజీవి, ఎండి ఖాదర్ ,వీరితోపాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులపై సర్వ సభ్య సమావేశంలో విస్తృత స్థాయి సమీక్ష

•శాఖల సమన్వయంతో ప్రజా సమస్యలకు సత్వర పరిష్కారం చూపాలి --
- ఎంపీడీఓ వి. అద్వైత






**నర్సంపేట ప్రతినిధి, ఆగస్టు:04,(తరంగాలు)**

ఖానాపురం మండల కేంద్రంలోని రైతు వేదికలో ఎంపీడీఓ వి. అద్వైత అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వ హించారు.సమావేశానికి మండల స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు అధిక సంఖ్యలో హాజరై వివిధ శాఖల అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సమస్యలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై సమగ్రంగా సమీక్షించారు.సమావేశంలో ఏపీఎం శాఖ ఆధ్వర్యంలో గ్రామాల్లో వినియోగంలో ఉన్న ట్రాక్టర్ల పనితీరును సమీక్షించారు. గ్రామ సంఘాల (వీఓ) సమావేశాలకు సంబంధిత సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులను తప్పనిసరిగా ఆహ్వానించి సమన్వయంతో పనిచేయాలని సూచించారు.గ్రామీణ నీటి సరఫరా శాఖ (ఆర్డబ్ల్యూఎస్) అధికారులు మిషన్ భగీరథ రికార్డులను త్వరితగతిన పూర్తి చేయాలని, ముఖ్యంగా మనుబోతులగడ్డ, ఖానాపురం గ్రామాల్లో పెండింగ్లో ఉన్న మిషన్ భగీరథ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించారు.16వ ఆర్థిక సంఘం నిధుల సద్వినియోగం, గ్రామ పంచాయతీల స్వంత ఆదాయ వనరుల (ఓఎస్ఆర్) పెంపు, గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక (జీపీడీపీ) తుది గ్రామసభలను నిర్ణీత గడువులోగా నిర్వహించి తీర్మానాలను పూర్తి చేయాలని సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు సూచించారు.పాకాల ప్రాజెక్టు నుంచి రెండు మోటార్ల ద్వారా సాగు నీటిని విడుదల చేయాలని కోరుతూ సమావేశంలో తీర్మానం చేసి, సంబంధిత తీర్మాన ప్రతిని జిల్లా కలెక్టర్కు పంపించాలని నిర్ణయించారు.విద్యుత్ శాఖ అధికారులు లైన్మెన్లను సర్పంచులతో సమన్వయం చేస్తూ అవసరమైన లైన్ క్లియరెన్స్లను సకాలంలో ఇవ్వాలని, విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.హౌసింగ్ శాఖ ఏఈ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల ప్రస్తుత స్థితిని వివరించి, లబ్ధిదారులు వేగంగా నిర్మాణాలు పూర్తి చేసుకునేలా క్షేత్రస్థాయిలో చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.వీబీగ్రామ్జీ కార్యక్రమం, పారిశుద్ధ్య నిర్వహణ, జలసిరి పనుల అమలుపై సంబంధిత అధికారులు సమావేశంలో వివరించి, గ్రామాల్లో పారిశుద్ధ్య ప్రమాణాలు మెరుగుపడేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.సీడీపీఓ అంగన్వాడీ కేంద్రాల్లో కొనసాగుతున్న పనుల పురోగతిని వివరించారు. బద్రు తండా సర్పంచ్ ప్రస్తావించిన గుడ్ల సరఫరా ఆలస్యంపై సంబంధిత సరఫరాదారుతో చర్చించి సమస్యను త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఎంఆర్వో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమం పురోగతిని సమీక్షించడంతో పాటు పౌర సరఫరాల శాఖకు సంబంధించిన అంశాలను సమావేశంలో చర్చించారు.ఎంఈఓ మండలంలోని విద్యా పరిస్థితిని వివరించి, పాఠశాలల్లో గుర్తించిన చిన్నపాటి మరమ్మతు పనులను ఏఏపీ పథకం ద్వారా త్వరలో పూర్తి చేయనున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా ఎంపీడీఓ శ్రీమతి వి. అద్వైత మాట్లాడుతూ, ప్రతి శాఖ సమన్వయంతో పనిచేస్తేనే ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల ఫలాలు ప్రజలకు పూర్తిస్థాయిలో అందుతాయని పేర్కొన్నారు. పెండింగ్లో ఉన్న పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి, ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో ఏఎంసి వైస్ ఛైర్మెన్ శాఖమూరి హరిబాబు, పిఏసిఎస్ ఛైర్మెన్ వల్లె శ్రీను, తహసీల్దార్ నంగునూరి రమేష్, మండల స్థాయి అధికారులు, సర్పంచ్ లు, పంచాయతి కార్యదర్శులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఎన్కూరు మండలంలో చోరీ



**•చేదించి నిందితులను పట్టుకున్న ఎన్కూరు పోలీసులు**

**తరంగాలు ఖమ్మం జిల్లా బ్యూరో** : ఏన్కూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని శ్రీరాంపురం తండాలో ఇటీవల జరిగిన ఇంట్లోకి చొరబడి వృద్ధురాలి మెడలోని బంగారు పుస్తెలతాడు చోరీ కేసును ఏన్కూర్ పోలీసులు అత్యంత వేగంగా ఛేదించి, నేరానికి పాల్పడిన ఇద్దరు నిందితులను అరెస్టు చేయడంతో పాటు చోరీకి గురైన బంగారు పుస్తెలతాడును పూర్తిగా స్వాధీనం చేసుకున్నారు. అరెస్టయిన నిందితులు భూక్య హర్షవర్ధన్,శ్రీంపురం తండా, ఏన్కూర్ మండలం బానోత్ కిషోర్ కొత్త తండా,టేకులపల్లి మండలం,భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నివాసులు. వీరిద్దరూ హైదరాబాద్‌లోని జెప్టో సంస్థలో ఉద్యోగాలు చేస్తూ ఒకే చోట నివాసం ఉంటున్నారు. దర్యాప్తులో నిందితులు తెలిపిన వివరాల ప్రకారం, భూక్య హర్షవర్ధన్ స్నేహితుల దగ్గర సుమారు రూ.1 లక్ష మేర అప్పులు చేశాడు. జెప్టో లో వచ్చే జీతం ఆ అప్పులు తీర్చడానికి సరిపోకపోవడంతో పాటు, కుటుంబ సభ్యులు కూడా అదనపు డబ్బులు ఇవ్వకపోవడంతో అప్పు ఇచ్చిన వ్యక్తులు అతనిపై తీవ్ర ఒత్తిడి తీసుకువచ్చారు. దీంతో ఎలాగైనా త్వరగా డబ్బు సంపాదించి అప్పులు తీర్చాలని నిర్ణయించుకున్నాడు. ఈ క్రమంలో తనతో కలిసి హైదరాబాద్‌లో పనిచేస్తున్న దూరపు బంధువు బానోత్ కిషోర్కు తన అప్పుల విషయం వివరించాడు. తేదీ 31-07-2026న కొత్తగూడెంలోని సెంట్రల్ పార్క్ వద్ద ఇద్దరూ కలుసుకుని సాయంత్రం వరకు కలిసి తిరిగారు. అనంతరం ఏన్కూర్ మండలం తిమ్మరపేట గ్రామానికి వచ్చి ఒక బెల్ట్ షాపులో మూడు బీర్లు కొనుగోలు చేసి గ్రామ శ్మశానవాటికలో కూర్చొని మద్యం సేవించారు. మద్యం సేవిస్తున్న సమయంలో హర్షవర్ధన్ తనకు ఉన్న అప్పుల గురించి కిషోర్‌కు వివరించి, వాటిని తీర్చుకోవడానికి ఇంట్లో ఉన్న బంగారం దొంగతనం చేయాలని ప్రతిపాదించాడు. మొదట తన నానమ్మ నాగమ్మ మెడలో ఉన్న బంగారు చైన్ దొంగతనం చేద్దామని భావించినప్పటికీ, కుటుంబ సభ్యులకు తనపై అనుమానం వస్తుందని భావించి ఆ ఆలోచనను విరమించుకున్నాడు. అనంతరం తన పెద్దతాత తావూరియా భార్య సాంఖలి మెడలో ఉన్న బంగారు పుస్తెలతాడును దొంగతనం చేయాలని ఇద్దరూ ముందస్తుగా ప్రణాళిక రూపొందించారు. దొంగతనం చేసిన బంగారాన్ని హైదరాబాద్‌కు తీసుకెళ్లి అక్కడ విక్రయించి వచ్చిన డబ్బుతో ముందుగా హర్షవర్ధన్ అప్పులు తీర్చుకుని, మిగిలిన మొత్తాన్ని ఇద్దరూ పంచుకోవాలని నిర్ణయించుకున్నారు. ప్రణాళిక ప్రకారం అదే రోజు అర్ధరాత్రి సుమారు 12.00 గంటలకు హర్షవర్ధన్ తన గ్రామానికి కిషోర్‌ను తీసుకెళ్లి, ఇంట్లోకి ప్రవేశించే మార్గాన్ని చూపించాడు. ముందుగా ఇంట్లో ఉన్నవారంతా గాఢ నిద్రలో ఉన్నారో లేదో నిర్ధారించుకున్నారు. అనంతరం ఎవరికీ అనుమానం రాకుండా ఉండేందుకు ప్రధాన రోడ్డుపై ఉన్న వీధి విద్యుత్ దీపాన్ని ఆఫ్ చేయాలని హర్షవర్ధన్ కిషోర్‌కు చెప్పగా, కిషోర్ వెళ్లి వీధి లైట్ ఆఫ్ చేసి తిరిగి వచ్చాడు. ఆ తరువాత ఇద్దరూ కలిసి ఇంట్లోకి ప్రవేశించారు. ఇంట్లోని బాత్రూమ్‌లో ఉన్న బ్లేడ్‌ను తీసుకున్న హర్షవర్ధన్, నిద్రిస్తున్న సాంఖలి మెడలో ఉన్న బంగారు పుస్తెలతాడును బ్లేడ్‌తో కట్ చేసి అపహరించాడు. ఆమె కదలిక గమనించగానే ఇద్దరూ వెంటనే అక్కడి నుంచి పరుగెత్తి గ్రామం బయటకు వెళ్లిపోయారు. చోరీ చేసిన బంగారు పుస్తెలతాడును వెంటనే అమ్మితే అనుమానం వస్తుందని భావించి, కొద్ది రోజులు హర్షవర్ధన్ తన వద్దే దాచుకున్నాడు. అనంతరం హైదరాబాద్ వెళ్లి అక్కడ విక్రయించి డబ్బును పంచుకోవాలని నిర్ణయించారు. కేసు నమోదు అనంతరం ఏన్కూర్ పోలీసులు వివిధ కోణాల్లో దర్యాప్తు చేపట్టి, అనుమానితుల కదలికలపై నిఘా ఉంచారు. ఈ రోజు అనగా 04-08-2026 ఉదయం ఏన్కూర్ పోలీసులు తూతిక్కలింగన్నపేట బ్రిడ్జి సెంటర్ వద్ద ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకుని విచారించి నిందితుల నుండి బంగారం స్వాధీనం చేసుకుని వారిని కోర్ట్ నందు హాజరు పరచడం జరిగింది. ఈ సందర్భంగా ఏసీపీ కల్లూరు వసుంధర యాదవ్ మాట్లాడుతూ అప్పుల ఒత్తిడి యువతను నేరాల వైపు నెడుతున్నాయని, ఎంతటి ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా చట్టవిరుద్ధమైన మార్గాలను ఎంచుకుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలు తమ ఇళ్ల భద్రతపై అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తులు కనిపించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ఈ కేసును అత్యంత వేగంగా ఛేదించి నిందితులను అరెస్టు చేసిన ఏన్కూర్ పోలీస్ స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఎన్.సంధ్య ని నిందితులను గుర్తించి వారిని అరెస్ట్ చేయడం లో చాకచక్యంగా వ్యవహరించిన హెడ్ కానిస్టేబుల్ శ్రీహరి,కానిస్టేబుల్ రాజా, దేవేంద్ర, రవి, శంకర్, వినయ్ హోమ్ గార్డ్ రాము లను ఏసీపీ వసుంధర యాదవ్ అభినందించారు.

# ద్విచక్ర వాహనాల చోరీలపై అప్రమత్తంగా ఉండాలి

- వాహన భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత..
- నిర్లక్ష్యంతో చోరీలకు అవకాశం ఇవ్వొద్దు
- వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత

**వరంగల్ ప్రతినిధి , ఆగస్టు 4 (తరంగాలు)**: వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ద్విచక్ర వాహనాల చోరీల నివారణకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత సూచించారు. వాహనాల భద్రత విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తూ ఆమె ప్రజలకు పలు సూచనలతో ప్రకటన విడుదల చేశారు.

వాహనాలను పార్క్ చేసే సమయంలో స్టీరింగ్ లాక్, హ్యాండిల్ లాక్ తప్పనిసరిగా వేయాలని, అవసరమైతే డిస్క్ లాక్ లేదా చైన్ లాక్‌ను కూడా వినియోగించాలని సూచించారు. రాత్రి వేళల్లో, అలాగే ఎక్కువ సమయం పాటు వాహనాలను నిలిపి ఉంచాల్సిన సందర్భాల్లో సీసీ కెమెరాల నిఘా ఉన్న, వెలుతురు బాగా ఉండే ప్రదేశాలను ఎంచుకోవాలని తెలిపారు. వాహనంలో తాళం చెవి ఉంచి వెళ్లకూడదని, స్పేర్ కీని కూడా వాహనంలో దాచిపెట్టవద్దని సూచించారు. వాహనాల భద్రతను మరింత పెంచేందుకు జీపీఎస్ ట్రాకింగ్ పరికరం లేదా యాంటీ-థెఫ్ట్ అలారం ఏర్పాటు చేసుకోవడం మంచిదని పేర్కొన్నారు. అలాగే వాహనానికి సంబంధించిన రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్ , ఇన్సూరెన్స్, ఇంజిన్ నంబర్, ఛాసిస్ నంబర్



వంటి వివరాలను భద్రంగా ఉంచుకోవాలని సూచించారు. వాహనాల చుట్టూ అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తులు కనిపించినా, అనుమానాస్పద ఘటనలు చోటుచేసుకున్నా వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్-100 / 112కు సమాచారం అందించాలని కోరారు.

**చోరీ జరిగితే వెంటనే ఫిర్యాదు**

ద్విచక్ర వాహనం చోరీకి గురైనట్లు తెలిసిన వెంటనే ఆలస్యం చేయకుండా సమీప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని కమిషనర్ సూచించారు. చోరీకి గురైన వాహనాల విషయంలో సమయానికి సమాచారం అందించడం ద్వారా పోలీసుల దర్యాప్తుకు మరింత సహకారం లభిస్తుందని తెలిపారు.

**సెకండ్ హ్యాండ్ వాహనాల కొనుగోలులో జాగ్రత్త**

సెకండ్ హ్యాండ్ ద్విచక్ర వాహనాలను కొనుగోలు చేసే ముందు వాహనానికి సంబంధించిన పత్రాలు, యాజమాన్య వివరాలు, పోలీసు రికార్డులను తప్పనిసరిగా పరిశీలించాలని సూచించారు. తక్కువ ధరకు వస్తుందని తొందరపడి పత్రాలు పరిశీలించకుండా వాహనాలు కొనుగోలు చేయవద్దని ప్రజలకు సూచించారు.

**నిర్లక్ష్యం వద్దు.. పోలీసులకు సహకరించండి**

"వాహన భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత. చిన్నపాటి నిర్లక్ష్యం కూడా వాహన చోరీకి కారణమయ్యే అవకాశం ఉంది. ప్రజలు పోలీసుల సూచనలు పాటిస్తూ అనుమానాస్పద వ్యక్తులు, సంఘటనలపై వెంటనే సమాచారం అందించి నేరాల నియంత్రణలో పోలీసులకు సహకరించాలి" అని వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## పుష్కరాల నాటికి భద్రాచలం ఆలయ అభివృద్ధి పనులు పూర్తి చేయాలి: కలెక్టర్ అంకిత్

**భద్రాద్రి జిల్లా బ్యూరో తరంగాలు న్యూస్ ఆగస్టు 4**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో వచ్చే ఏడాది గోదావరి పుష్కరాల నాటికి భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో చేపడుతున్న పునర్నిర్మాణ, అభివృద్ధి పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్టతో కలిసి ఆలయంలో జరుగుతున్న పనులను పరిశీలించిన ఆయన, ఆలయ ప్రాచీనతకు భంగం కలగకుండా నాణ్యత ప్రమాణాలతో పనులు చేపట్టాలని సూచించారు. భక్తులకు మెరుగైన దర్శన సౌకర్యాలు, రోడ్లు, పాదచారుల మార్గాలు, తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్య వసతులు పుష్కరాల నాటికి అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు ఆదేశించారు. ఉత్తర ద్వార దర్శనం నిర్మాణాన్ని ముక్కోటి ఏకాదశి నాటికి పూర్తి చేయాలని కూడా స్పష్టం చేశారు.



## బాలవికాస ఆధ్వర్యంలో ఉచిత ఆరోగ్య శిబిరం



**జఫర్గడ్ ప్రతినిధి, ఆగస్టు 4, (తరంగాలు** ):మండలంలోని రఘునాథ్ పల్లి గ్రామంలో బాలవికాస స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఉచిత ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేయడం జరిగింది లక్ష్మీ నరసింహ లియోనెస్ హాస్పిటల్ వారు డాక్టర్ సంధ్యారాణి సహకారంతో మహిళలకు ఉచితంగా మందులు ఇవ్వడం జరిగింది . దీనికి అతిథులుగా సర్పంచ్ ఏడ్ల వెంకటయ్య, ఉప సర్పంచ్ సుధీర్ రెడ్డి, వార్డు మెంబర్లు మాళవికాస కోఆర్డినేటర్ లు అనిత గ్రామ పెద్దలు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## శిశువుల ఎదుగుదలకు తల్లిపాలే ముఖ్యం - సర్పంచ్ భూక్య నరేష్



**పర్వతగిరి, తరంగాలు (ఆగస్టు 4):** మండలంలోని మోత్య తండా గ్రామపంచాయతీ పరిధి అంగన్వాడి కేంద్రంలో ఏర్పాటుచేసిన తల్లిపాల వారోత్సవాల కార్యక్రమంలో సర్పంచ్ భూక్యా నరేష్ ముఖ్య అతిథిగా పాల్గొని పిల్లల తల్లులకు పలు సూచనలు, సలహాలు ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ...తల్లిపాలు పుట్టిన పిల్లలకు శ్రేష్టమైనవని, పుట్టినప్పటి నుంచి శిశువుకు తల్లిపాలను ఇవ్వడం ద్వారా పిల్లలు మానసిక, శారీరక పెరుగుదల బాగా ఉంటుందని సర్పంచ్ భూక్యా నరేష్ అన్నారు. ఈ సందర్భంగా హాజరైన తల్లు లకు పలు సూచనలు చేశారు. వర్షాలు పడుతున్న నేపథ్యంలో పిల్లల రక్షణకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, వర్షంలో బయటికి వెళ్లకుండా ముఖ్యంగా తడవకుండా జాగ్రత్త తీసుకుంటూ,అంగన్వాడీ కార్యకర్తల సహాయాన్ని పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ దేవి, సీత్యాతండా, మోత్య తండా అంగన్వాడీ కేంద్రాల టీచర్లు స్వాతి,సునీత పాల్గొన్నారు.

## తల్లిపాలే శిశువులకు అమృతం

- ప్రతి తల్లి తప్పనిసరిగా బిడ్డకు తల్లిపాలు అందించాలి: సర్పంచ్ ముక్కముల శ్యామల శేఖర్



**నల్గొండ, ఆగస్టు 4 (తరంగాలు):**

తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకుని కట్టంగూర్ మండల కేంద్ర పరిధిలోని అంబేద్కర్ నగర్ కాలనీలో ఉన్న అంగన్వాడీ కేంద్రంలో మంగళవారం పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లిపాల ప్రాధాన్యతపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించడంతో పాటు చిన్నారులకు అక్షరాభ్యాసం, అన్నప్రాసన కార్యక్రమాలను ఘనంగా చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గ్రామ సర్పంచ్ ముక్కముల శ్యామల శేఖర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తల్లిపాలు శిశువులకు ఎంతో శ్రేష్ఠమైనవని, ప్రతి తల్లి తన బిడ్డకు తప్పనిసరిగా తల్లిపాలు అందించాలని సూచించారు. తల్లిపాలలో శిశువుల ఎదుగుదలకు అవసరమైన పోషకాలు లభిస్తాయని తెలిపారు. అదేవిధంగా గర్భిణీలు, బాలింతలు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తల్లులు, చిన్నారుల ఆరోగ్య పరిరక్షణకు అంగన్వాడీ కేంద్రాల సేవలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్‌వైజర్ శారద, వార్డు సభ్యులు మైనం ఉమా, ఏనుగు సైదులు, శ్రీరామ్ సంధ్య, వీరేష్, కళ్లెం నాగేశ్వరావు, అంగన్వాడీ టీచర్లు, ఆయాలు, గ్రామపంచాయతీ సిబ్బంది, బాలింతలు, గర్భిణీలు, చిన్నారులు, కాలనీ ప్రజలు పాల్గొన్నారు.



THARANGALU DAILY NEWS
బుధవారం, 05 ఆగస్టు, 2026
జాతీయ దిన పత్రిక
తరంగాలు

# రాష్ట్రాలు వేరైనా గౌడన్నల ఐక్యత ఒక్కటే



- ఆపదలో ఉన్న గీత కార్మికుల కుటుంబాలకు గీతబంధు సేవా ట్రస్ట్ అండ
- సీఐ బుర్ర సురేష్ గౌడ్ చొరవతో బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం
- రెండు కుటుంబాలకు రూ.20 వేల చొప్పున చేయూతనిచ్చిన గీతబంధు సేవా ట్రస్ట్



కేసముద్రం, ఆగస్టు 4,తరంగాలు : గీత కార్మికుల సంక్షేమం కోసం రాష్ట్రాలకతీతంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ, ఆపదలో ఉన్న గీత కార్మికుల కుటుంబాలకు అండగా నిలుస్తున్న గీతబంధు సేవా ట్రస్ట్, ఆంధ్రప్రదేశ్ మానవతా దృక్పథంతో కేసముద్రం ప్రాంతంలోని ప్రమాద బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించింది.కేసముద్రం మండలం కల్వల గ్రామానికి చెందిన మల్లేశం ఇటీవల తాడిచెట్టుపై గీత వృత్తి నిర్వహిస్తుండగా ప్రమాదవశాత్తు చెట్టుపై నుంచి జారిపడి అక్కడికక్కడే మృతి చెందారు. అలాగే విలేజ్ కేసముద్రంకు చెందిన ఉట్కూరి శ్రీనివాస్ తాడిచెట్టుపై నుంచి ప్రమాదవశాత్తు జారిపడి తీవ్రంగా గాయపడ్డారు. ఈ ప్రమాదంలో ఆయన కాళ్లు, చేతులు, నడుముకు తీవ్ర గాయాలు కావడంతో సుమారు పది రోజుల పాటు ఆసుపత్రిలో చికిత్స పొందిన అనంతరం మృతి చెందారు. దీంతో రెండు కుటుంబాలు తీవ్ర విషాదంలో, ఆర్థిక ఇబ్బందుల్లో చిక్కుకున్నాయి.



### సీఐ బుర్ర సురేష్ గౌడ్ చొరవతో బాధిత కుటుంబాలకు చేయూత

బాధిత కుటుంబాల పరిస్థితిని తెలుసుకున్న ఉప్పరపల్లి గ్రామానికి చెందిన సీఐ బుర్ర సురేష్ గౌడ్ ఈ విషయాన్ని గీతబంధు సేవా ట్రస్ట్ ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లారు. ఆయన చొరవతో స్పందించిన ట్రస్ట్ ప్రతినిధులు కేసముద్రానికి చేరుకుని రెండు బాధిత కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.20,000 చొప్పున ఆర్థిక సహాయం అందించారు. గౌడ సంఘం సభ్యులు సీఐ బుర్ర సురేష్ గౌడ్ కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. గీత కార్మికుల కుటుంబాల పరిస్థితిని తెలుసుకుని, వారి కష్టాలను గీతబంధు సేవా ట్రస్ట్ దృష్టికి తీసుకెళ్లి ఆపదలో ఉన్న కుటుంబాలకు ఆర్థిక సహాయం అందేలా చొరవ చూపడం అభినందనీయమని పేర్కొన్నారు.

### ఏ రాష్ట్రంలో గీతన్నకు ఆపద వచ్చినా అండగా ఉంటాం: గీతబంద్ ట్రస్ట్ కార్యదర్శి సింహాచలం

గీత కార్మికులు ఏ రాష్ట్రంలో ఉన్నా వారికి ఎలాంటి ఇబ్బంది ఎదురైనా తమ ట్రస్ట్ అండగా నిలుస్తుందని గీతబంద్ ట్రస్ట్ కార్యదర్శి సింహాచలం తెలిపారు. ప్రమాదవశాత్తు గీత వృత్తిలో పనిచేసే సామర్థ్యాన్ని కోల్పోయిన వారికి, ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయిన గీత కార్మికుల కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించడమే ట్రస్ట్ ప్రధాన ఉద్దేశమన్నారు.గీత కార్మికులు సురక్షితంగా ఉండాలని, వారి కుటుంబాలు ఆపద సమయంలో ఇబ్బందులు పడకుండా అవసరమైన సమయంలో సహాయం అందించాలనే లక్ష్యంతో ట్రస్ట్ సేవా కార్యక్రమాలు కొనసాగిస్తోందని చెప్పారు. రాబోయే రోజుల్లో కూడా గీత కార్మికులకు ఎలాంటి సమస్య వచ్చినా గీతబంధు సేవా ట్రస్ట్ ముందుండి సహాయ సహకారాలు అందిస్తుందని హామీ ఇచ్చారు.

### గీతబంధు సేవా ట్రస్ట్ సేవలు అమూల్యం-- స్థానిక గౌడ సంఘం నాయకులు

ఈ సందర్భంగా కన్నె కన్నయ్య గౌడ్, మోడం రవీందర్ గౌడ్, రాడం వెంకన్న గౌడ్, చిలువేరు సమ్మయ్య గౌడ్ తదితరులు మాట్లాడుతూ.. రాష్ట్రాలు వేరైనా గీత కార్మికుల కోసం స్పందించి కేసముద్రం వచ్చి బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించిన గీతబంధు సేవా ట్రస్ట్ సేవలు అమూల్యమైనవని కొనియాడారు.గీత కార్మికుల కుటుంబాలు కష్టాల్లో ఉన్న సమయంలో వారి బాధను అర్థం చేసుకుని, ఎలాంటి ప్రతిఫలాన్ని ఆశించకుండా సహాయం అందించడం ఎంతో గొప్ప విషయమన్నారు. ఆంధ్రప్రదేశ్ నుంచి కేసముద్రం వరకు వచ్చి గీత కార్మికుల కుటుంబాలకు అండగా నిలవడం గౌడన్నల ఐక్యతకు, మానవతా దృక్పథానికి నిదర్శనమని అన్నారు.గీతబంధు సేవా ట్రస్ట్ ప్రతినిధులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తూ, భవిష్యత్తులో కూడా గీత కార్మికులకు అవసరమైన సమయంలో ఇదే విధంగా సహాయ సహకారాలు అందించాలని కోరారు.

### సింహాచలంకు ఘన సన్మానం

బాధిత గీత కార్మికుల కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించిన గీతబంధు సేవా ట్రస్ట్ కార్యదర్శి సింహాచలం ను ఘనంగా సన్మానించి, శాలువాతో సత్కరించి అభినందించారు. గీత కార్మికుల సంక్షేమం కోసం ట్రస్ట్ చేస్తున్న సేవా కార్యక్రమాలు మరింత విస్తరించాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో జోగు డాంగయ్య గౌడ్,బండారి విజేందర్ గౌడ్, చింతనూరి వెంకన్న గౌడ్, గండి శ్రీనివాస్ గౌడ్, పబ్బతి సారంగపాని,బండారి గోపి గౌడ్,ఓరుగంటి వెంకన్న,పోడేటి దినేష్ గౌడ్, రాడేం శ్రీనివాస్ గౌడ్,దొమ్మటి రాజు గౌడ్, బండారు గోపిచందర్, బండారు రాజు గౌడ్, బండారు శ్రవణ్ గౌడ్,పబ్బతి సత్యనారాయణ గౌడ్, బాధిత కుటుంబ సభ్యులు, గీత బంద్ ట్రస్ట్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# మాటలు కోటలు దాటుతాయి పనులు బ్రిడ్జి వద్దే ఆగిపోతాయి

- నాయిని రాజేందర్‌రెడ్డి మీరు చెప్పిన టైమ్ అయిపోయింది
- ఫాతిమానగర్ ఫ్లైఓవర్ పనులు పూర్తి చేయాలంటూ బీజేపీ ధర్నా
- ఎమ్మెల్యే నాయిని పై రావు పద్మారెడ్డి ఫైర్
- ఫాతిమానగర్ ఫ్లైఓవర్‌పై బీజేపీ సమరశంఖం



**హనుమకొండ ప్రతినిధి , ఆగస్టు 4, తరంగాలు :** కాజీపేట ఫాతిమానగర్ వద్ద ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు ఐదేళ్లుగా మందకొడిగా సాగుతున్నా ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే పట్టించుకోవడం లేదని బీజేపీ నాయకురాలు రావు పద్మారెడ్డి విమర్శించారు. ప్రజలు నిత్యం ట్రాఫిక్ సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.
ఫ్లైఓవర్ నిర్మాణంలో జాప్యాన్ని నిరసిస్తూ బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు కొలను సంతోష్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం ఫాతిమానగర్ బ్రిడ్జి వద్ద ధర్నా నిర్వహించారు. బీజేపీ వరంగల్ పశ్చిమ నియోజకవర్గ నాయకురాలు రావు పద్మారెడ్డి నేతృత్వంలో పార్టీ శ్రేణులు ఆందోళన చేపట్టాయి. ఈ సందర్భంగా రావు పద్మారెడ్డి మాట్లాడుతూ.. "ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి.. మీరు చెప్పిన టైమ్ అయిపోయింది" అని వ్యాఖ్యానించారు. మేడారం జాతరలోపు బ్రిడ్జి పనులు పూర్తి చేస్తామని ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. జాతర సమయం వచ్చినా పనులు పూర్తయ్యే పరిస్థితి కనిపించడం లేదని, ఇది ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమన్నారు. పాత బ్రిడ్జి శిథిలావస్థకు చేరడంతో రూ.78 లక్షల అంచనా వ్యయంతో టెండర్లు వేసినా కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకపోవడం వల్లే పనులు నిలిచిపోయాయని ఆమె ఆరోపించారు. పనుల ఆలస్యానికి రైల్వే అనుమతులను కారణంగా చూపవద్దని సూచించారు. కాంట్రాక్టర్ సామగ్రి, గడ్డర్లు సిద్ధం చేస్తే రైల్వే అనుమతుల కోసం కేంద్ర మంత్రులు జి. కిషన్‌రెడ్డి, అశ్విని వైష్ణవ్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే బాధ్యత తమదేనన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఫ్లైఓవర్ నిర్మాణాన్ని పూర్తి చేయాలని, లేనిపక్షంలో ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని రావు పద్మారెడ్డి హెచ్చరించారు. బీజేపీ నేతల హాజరుధర్నాలో మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు, డా. పగడాల కాళీప్రసాద్‌రావు, పులి సర్రోతం రెడ్డి తదితరులు పాల్గొన్నారు. బీజేపీ జిల్లా నాయకులు, వివిధ డివిజన్ అధ్యక్షులు, కార్యకర్తలు, స్థానిక నాయకులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.



# అక్రమాలను ప్రశ్నిస్తే దాడులా





- బాధ్యతాయుతమైన సర్పంచ్ పదవిలో ఉండి యువకుడిపై దాడి ఆరోపణలు సమంజసమా
- ప్రజా సమస్యలను వెలుగులోకి తెచ్చిన వారిని బెదిరించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం
- ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే హక్కు కీలకం
- సర్పంచ్ పదవి ప్రజల కోసం.. పెత్తనం కోసం కాదు
- ఉన్నతాధికారులు నిష్పక్షపాత విచారణ చేపట్టాలి
- వరంగల్ జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేసిన దూప తండావాసి బానోతు నవీన్

**పర్వతగిరి, ఆగస్టు 4 (తరంగాలు):** ప్రజల సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యతాయుతమైన సర్పంచ్ పదవిలో ఉండి, గ్రామంలో జరుగుతున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న అక్రమాలను ప్రశ్నించిన యువకుడిపై దాడి చేశారన్న ఆరోపణలు తీవ్ర చర్చకు దారితీశాయి. పర్వతగిరి మండలం దూప తండాలో అక్రమ ఇసుక రవాణాను ప్రశ్నించినందుకే తనపై దూప తండా సర్పంచ్ ధరంసోత్ తిరుపతి కక్ష పెంచుకుని దాడి చేసి, బెదిరింపులకు పాల్పడ్డారని దూపతండాకు చెందిన బానోత్ నవీన్ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదులో పేర్కొన్న వివరాలు ఇలా ఉన్నాయి. దూప తండా సర్పంచ్ ధరంసోత్ తిరుపతి, మాజీ ఉపసర్పంచ్ భూక్య రాములతో కలిసి ఆకేరువాగులో నిబంధనలకు విరుద్ధంగా పగలు రాత్రి తేడా లేకుండా వందలాది ట్రాక్టర్లలో ఇసుకను తరలిస్తూ.. పల్లె ప్రకృతి వనం సమీపంలో అక్రమ ఇసుక నిల్వ చేశారని, అదేవిధంగా పోలీస్ రెవెన్యూ అధికారులకు పెద్ద ఎత్తున మామూలు ముట్ట చెబుతూ దాందా కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు. ఈ అక్రమాలను ప్రశ్నించినందుకు అన్నారం సర్పంచ్ ఇంటికి పిలిపించి నాపై దాడి చేసి, సెల్ఫోన్ పగలగొట్టి చంపుతామని బెదిరించారని ఆరోపించాడు. అంతేకాకుండా ఈ విషయం ఎవరితో చెప్పొద్దని దేవాలయంలోకి తీసుకెళ్లి దేవుడి పై ప్రమాణం చేయించారని, వారితో నాకు ప్రాణభయం ఉందని, అక్రమ ఇసుక నిలువలతో పాటు జెసిపి ట్రాక్టర్లను సీ చేసి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని బాధితుడు కోరారు.

## ప్రశ్నించడం తప్పా..?

గ్రామ పంచాయతీకి సర్పంచ్ అంటే ప్రజలకు జవాబుదారీతనంతో పనిచేయాల్సిన ప్రజాప్రతినిధి. గ్రామంలో ఏదైనా అక్రమం జరుగుతోందని ఎవరైనా ప్రశ్నిస్తే, దానిపై అధికారులకు సమాచారం ఇచ్చి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాల్సింది పోయి.. ప్రశ్నించిన వ్యక్తిపై దాడి, బెదిరింపులకు పాల్పడటం ఎంతవరకు సమంజసమనే ప్రశ్నలు ఇప్పుడు ఉత్పన్నమవుతున్నాయి.
అక్రమ ఇసుక రవాణాపై ప్రశ్నించినందుకే తనపై దాడి చేసి, మొబైల్ ఫోన్ పగులగొట్టి బెదిరించారని నవీన్ ఆరోపిస్తున్నారు. ఈ ఆరోపణలు నిజమైతే ప్రజాప్రతినిధి పదవిలో ఉన్న వ్యక్తి వ్యవహరించిన తీరు తీవ్రంగా ఖండించాల్సిందేనని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

## ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే హక్కు కీలకం

ప్రజాస్వామ్యంలో ప్రజలు తమ సమస్యలను ప్రశ్నించడం, అక్రమాలపై అధికారుల దృష్టికి తీసుకెళ్లడం సహజం. అలాంటి వారిని భయపెట్టడం, బెదిరించడం లేదా దాడులకు పాల్పడటం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని పలువురు పేర్కొంటున్నారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న వారు కూడా వాస్తవాలను ప్రజల ముందు వెల్లడించాల్సిన అవసరం ఉందని అంటున్నారు.

## ఉన్నతాధికారులు నిష్పక్షపాత విచారణ చేపట్టాలి

యువకుడిపై దాడి జరిగిందన్న ఆరోపణలు, ఆకేరు వాగులో అక్రమ ఇసుక రవాణా ఆరోపణలపై అధికారులు సమగ్రంగా విచారణ చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. ఆరోపణలు నిజమని తేలితే బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని, అదే సమయంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న వారికి తమ వాదనను వెల్లడించే అవకాశం కల్పించాలని కోరుతున్నారు.

## సర్పంచ్ పదవి ప్రజల కోసం.. పెత్తనం కోసం కాదు

సర్పంచ్ పదవి ప్రజల విశ్వాసంతో లభించిన బాధ్యత. ఆ పదవిలో ఉన్న వ్యక్తి ప్రజలకు ఆదర్శంగా నిలవాలి తప్ప, ప్రశ్నించే గొంతులను అణచివేసే విధంగా వ్యవహరించకూడదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అక్రమాలను ప్రశ్నించిన యువకుడిపై దాడి జరిగిందన్న ఆరోపణలు నిజమైతే.. అది ఒక్క వ్యక్తిపై దాడి మాత్రమే కాదు, ప్రజాస్వామ్య హక్కులపైనే దాడిగా భావించాల్సి ఉంటుందని స్థానికులు అంటున్నారు.

# గ్రామస్థాయిలో కాంగ్రెస్‌కు పటిష్ట పునాది

- కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి నూతన గ్రామ పార్టీ అధ్యక్షులు కృషి చేయాలి
- వర్ధన్నపేట మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పోశాల వెంకన్న గౌడ్
- నల్లబెల్లి,రామవరం, కొత్తపెల్లి,వెంకట్రావుపల్లిలో కాంగ్రెస్ గ్రామ కమిటీల నియామకం



**వర్ధన్నపేట ప్రతినిధి, ఆగస్టు 4,తరంగాలు :** గ్రామస్థాయిలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు నూతనంగా నియమితులైన గ్రామ పార్టీ అధ్యక్షులు సమన్వయంతో పనిచేయాలని వర్ధన్నపేట మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పోశాల వెంకన్న గౌడ్ పిలుపునిచ్చారు. తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ నిర్ణయం, ఎమ్మెల్యే కే.ఆర్. నాగరాజు ఆదేశాల మేరకు మండల



పార్టీ అధ్యక్షుడు పోశాల వెంకన్న గౌడ్ ఆధ్వర్యంలో మండలంలోని నల్లబెల్లి, రామవరం, కొత్తపెలిఈ సందర్భంగా పోశాల వెంకన్న గౌడ్ మాట్లాడుతూ.. గ్రామస్థాయిలో పార్టీ కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు పార్టీ సిద్ధాంతాలను ప్రజలకు వివరించాలని అన్నారు. ప్రతి గ్రామంలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసే దిశగా నూతన అధ్యక్షులు బాధ్యతాయుతంగా పనిచేయాలని కోరారు. నూతన గ్రామ పార్టీ అధ్యక్షులుగా కొత్తపెల్లి--తాళ్లపెల్లి యాదగిరి గౌడ్, వెంకట్రావుపల్లి--గొట్టం చిరంజీవి, నల్లబెల్లి--తాటికాయల దిలీప్, రామవరం--గజ్జెల రామచంద్రులను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులకు నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు ఎద్దు సత్య నారాయణ , బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అబ్బిడి రాజి రెడ్డి, ఐనవోలు టెంపుల్ చైర్మన్ కమ్మగోని ప్రభాకర్ గౌడ్, వర్ధన్నపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నరుకుడు వెంకటయ్య, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రతి బాను ప్రసాద్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు దామెర ప్రశాంత్, ఎస్సీ సెల్ జిల్లా నాయకులు మల్లెపాక సమ్మయ్య, మరుపట్ల సాయికుమార్, చిధుముల్ల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



# ప్రభుత్వ ఆసుపత్రుల బలోపేతానికి ప్రత్యేక చర్యలు





- ఉమ్మడి వరంగల్ జిల్లాలో వైద్య సేవల విస్తరణపై మంత్రి దామోదర సమీక్ష
- సమీక్ష సమావేశంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

**హైదరాబాద్, ఆగస్టు 4, తరంగాలు :** ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజలకు నాణ్యమైన, అత్యాధునిక వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య, ఆరోగ్య మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు చేపడుతోందని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. హైదరాబాద్ సచివాలయంలోని మంత్రి కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు పాల్గొన్నారు. సమావేశంలో వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణ పనుల పురోగతి, ఎంజీఎం ఆసుపత్రి అభివృద్ధి, వర్ధన్నపేట నియోజకవర్గంలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో మౌలిక వసతుల కల్పన, వైద్య సేవల విస్తరణ తదితర అంశాలపై చర్చించారు. ఆసుపత్రులకు అవసరమైన అదనపు నిధుల మంజూరు, మందుల లభ్యత, వైద్య సిబ్బంది కొరతను పరిష్కరించడం, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు. నియోజకవర్గంలోని ప్రతి ప్రభుత్వ ఆసుపత్రిని దశలవారీగా బలోపేతం చేసి ప్రజలకు అత్యుత్తమ వైద్య సేవలు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు పేర్కొన్నారు. ప్రజారోగ్యానికి అత్యున్నత ప్రాధాన్యమిస్తూ మెరుగైన వైద్య మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తుందని తెలిపారు. సమావేశంలో మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, నాయిని రాజేందర్ రెడ్డి, రేవూరి ప్రకాష్ రెడ్డి, యశస్విని రెడ్డితో పాటు ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు, డీఎంహెచ్‌వోలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# సీకేఎం కళాశాలలో అతిథి అధ్యాపకుల పోస్టులు

**వరంగల్ ప్రతినిధి , ఆగస్టు 4, తరంగాలు :** దేశాయిపేటలోని సీకేఎం ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో 2026--27 విద్యా సంవత్సరానికి అతిథి అధ్యాపకులుగా పనిచేసేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి. పోశయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.
కంప్యూటర్ సైన్స్ విభాగంలో రెండు అతిథి అధ్యాపకుల పోస్టులు ఖాళీగా ఉన్నట్లు పేర్కొన్నారు. ఓసీ, బీసీ అభ్యర్థులు కనీసం 55 శాతం మార్కులతో, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు 50 శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలని తెలిపారు. ఎంపిక ప్రక్రియలో పీహెచ్‌డీ, నెట్, సెట్ అర్హతలతో పాటు బోధనా అనుభవం కలిగిన అభ్యర్థులకు తొలి ప్రాధాన్యం ఉంటుందని ప్రిన్సిపాల్ వెల్లడించారు. అర్హులైన అభ్యర్థులు తమ దరఖాస్తులను ఆగస్టు 11, 2026 సాయంత్రం 4 గంటల్లోగా కళాశాలలో అందజేయాలని సూచించారు.
దరఖాస్తుల పరిశీలన అనంతరం అర్హత కలిగిన అభ్యర్థులకు సమాచారం అందించి ఎంపిక ప్రక్రియ చేపడతామని తెలిపారు. పూర్తి వివరాల కోసం సీకేఎం ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలను సంప్రదించాలని ప్రిన్సిపాల్ సూచించారు.

THARANGALU DAILY NEWS
బుధవారం, 05 ఆగస్టు, 2026
జాతీయ దిన పత్రిక
తరంగాలు

# నిర్మాణ రంగంలో పడిదల నవీన్ కుమార్‌కు

# 'ఎక్సలెన్స్' కిరీటం







**కార్పొరేట్ సివిల్, ఇంటీరియర్ సొల్యూషన్స్‌లో విశిష్ట సేవలకు గుర్తింపు**

**నాణ్యతకు నజరానా.. నవీన్ కుమార్‌కు ఘన సత్కారం**

**టైమ్స్ ఆఫ్ ఇండియా తెలంగాణ 2026 అవార్డు అందుకున్న పడిదల నవీన్ కుమార్**

**సోనూ సూద్ చేతుల మీదుగా ప్రతిష్ఠాత్మక పురస్కారం స్వీకరణ**

**మైక్రోసాఫ్ట్, డెల్, విప్రో, టెక్ మహీంద్రా వంటి ప్రముఖ సంస్థల ప్రాజెక్టులతో ప్రత్యేక గుర్తింపు**

**సివిల్ నిర్మాణం నుంచి జాతీయ గుర్తింపు వరకు..**

**నవీన్ కుమార్ నాయకత్వంలో సీహెచ్ఎస్ ప్రాజెక్ట్స్ విజయ ప్రస్థానం**





హైదరాబాద్, ఆగస్టు 3, తరంగాలు ప్రతినిధి : కార్పొరేట్ సివిల్ నిర్మాణం, ప్రీమియం ఇంటీరియర్ సొల్యూషన్స్ రంగాల్లో విశిష్ట సేవలు అందిస్తూ జాతీయ స్థాయిలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్న సీహెచ్ఎస్ ప్రాజెక్ట్స్ వ్యవస్థాపకుడు, డైరెక్టర్ పడిదల నవీన్ కుమార్ మరో ప్రతిష్ఠాత్మక పురస్కారాన్ని సొంతం చేసుకున్నారు.

టైమ్స్ ఆఫ్ ఇండియా తెలంగాణ 2026 ఆధ్వర్యంలో నిర్వహించిన అవార్డుల ప్రదానోత్సవంలో 'ఎక్సలెన్స్ ఇన్ కార్పొరేట్ సివిల్ & ఇంటీరియర్ సొల్యూషన్స్' అవార్డును నవీన్ కుమార్ అందుకున్నారు. తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా సమక్షంలో, సేవా కార్యక్రమాలతో దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన సినీ నటుడు సోనూ సూద్ చేతుల మీదుగా ఆయన ఈ పురస్కారాన్ని స్వీకరించారు.

ఈ అవార్డు తనకు వ్యక్తిగతంగా ఎంతో గౌరవాన్ని, బాధ్యతను పెంచిందని నవీన్ కుమార్ తెలిపారు. ఈ గుర్తింపును అందించిన టైమ్స్ ఆఫ్ ఇండియా యాజమాన్యానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ పురస్కారం తన వ్యక్తిగత విజయమే కాకుండా, సీహెచ్ఎస్ ప్రాజెక్ట్స్ బృందం, క్లయింట్లు, కుటుంబ సభ్యులు, స్నేహితులు, శ్రేయోభిలాషుల సమిష్టి కృషికి దక్కిన గౌరవమని పేర్కొన్నారు.

### నాణ్యతే నమ్మకానికి ప్రతీక

"ప్రతి ప్రాజెక్ట్ ఒక నిర్మాణం మాత్రమే కాదు... అది నాణ్యతపై నిర్మించబడిన విశ్వాసానికి ప్రతీక" అనే సిద్ధాంతంతో సీహెచ్ఎస్ ప్రాజెక్ట్స్‌ను నవీన్ కుమార్ ముందుకు నడిపిస్తున్నారు. సాంకేతిక నైపుణ్యం, నాణ్యత, సమయపాలన, పారదర్శకత, నైతిక విలువలకు ప్రాధాన్యం ఇస్తూ గత పదేళ్లుగా సంస్థ అనేక ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులను విజయవంతంగా పూర్తి చేసింది. మైక్రోసాఫ్ట్, డెల్ టెక్నాలజీస్, విప్రో, టెక్ మహీంద్రా, సెయెంట్, యూనిసిస్, బ్రాడ్‌రిడ్జ్ వంటి ప్రముఖ సంస్థల కోసం సీహెచ్ఎస్ ప్రాజెక్ట్స్ కీలక పనులను పూర్తి చేసింది. అలాగే మహీంద్రా యూనివర్సిటీ, ఫ్లేమ్ యూనివర్సిటీ వంటి విద్యాసంస్థల్లోనూ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులను విజయవంతంగా అమలు చేసింది.




### ఆనంద్ మహీంద్రా ప్రశంసలు

మహీంద్రా యూనివర్సిటీలో చేపట్టిన సివిల్, కోఆర్డినేషన్, ప్రీమియం ఇంటీరియర్ పనుల నాణ్యతకు పారిశ్రామికవేత్త ఆనంద్ మహీంద్రా నుంచి వ్యక్తిగత ప్రశంసలు లభించడం సంస్థ ప్రతిష్ఠను మరింత పెంచిందని నవీన్ కుమార్ తెలిపారు.

హైదరాబాద్‌తో పాటు బెంగళూరు, పుణే, ముంబై, చెన్నై, నోయిడా తదితర ప్రధాన నగరాల్లో సేవలను విస్తరించిన సీహెచ్ఎస్ ప్రాజెక్ట్స్ ప్రస్తుతం దేశవ్యాప్తంగా విశ్వసనీయ సంస్థగా ఎదుగుతోంది.

### సామాజిక బాధ్యతకు పెద్దపీట

వ్యాపార విజయాలతో పాటు సామాజిక బాధ్యతను కూడా నవీన్ కుమార్ సమానంగా భావిస్తున్నారు. ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు విద్యా సహాయం అందించడంతో పాటు గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలకు తనవంతు సహకారం అందిస్తూ సామాజిక సేవలోనూ ముందుంటున్నారు. వ్యాపార వృద్ధితో పాటు సమాజానికి తిరిగి ఇవ్వాలనే ఆలోచనతో ఆయన ముందుకు సాగుతున్నారు.

### వరుసగా ప్రతిష్ఠాత్మక అవార్డులు

కార్పొరేట్ మౌలిక సదుపాయాల రంగంలో చేసిన విశేష సేవలకు తాజాగా టైమ్స్ ఆఫ్ ఇండియా తెలంగాణ 2026 'ఎక్సలెన్స్ ఇన్ కార్పొరేట్ సివిల్ & ఇంటీరియర్ సొల్యూషన్స్' అవార్డు అందుకున్న నవీన్ కుమార్, అంతకుముందు బిమలేషియా తెలంగాణ అసోసియేషన్ 'బిజినెస్ ఐకాన్ అవార్డు'ను కూడా అందుకున్నారు.

వరుసగా లభిస్తున్న ఈ పురస్కారాలు పడిదల నవీన్ కుమార్ వ్యాపార నాయకత్వం, నాణ్యతా ప్రమాణాలు, సామాజిక బాధ్యతకు నిదర్శనంగా నిలుస్తున్నాయి. భవిష్యత్తులో మరింత ఉన్నత ప్రమాణాలతో అత్యుత్తమ ప్రాజెక్టులను అందిస్తూ సీహెచ్ఎస్ ప్రాజెక్ట్స్‌ను జాతీయ స్థాయిలో మరింత ఉన్నత స్థానానికి తీసుకెళ్లడమే తన లక్ష్యమని నవీన్ కుమార్ తెలిపారు.

# రహానేపై సునీల్ గవాస్కర్ ప్రశంసల జల్లు



టీమిండియా మాజీ క్రికెటర్ అజింక్యా రహానేపై దిగ్గజ క్రికెటర్ సునీల్ గవాస్కర్ ప్రశంసల జల్లు కురిపించాడు. భారత క్రికెట్‌లో అజింక్యా రహానే అజాత శత్రువని కొనియాడాడు. రహానే సగర్వంగా ఆట నుంచి నిష్క్రమించాడని కొనియాడాడు. అయినా రహానేకు భారత క్రికెట్‌లో అన్యాయమే జరిగిందని, రావాల్సిన గుర్తింపు రాలేదని పేర్కొన్నాడు. ఇటీవల అజింక్యా రహానే అన్ని ఫార్మాట్ల క్రికెట్‌కు వీడ్కోలు పలికిన సంగతి తెలిసిందే. తన నిర్ణయాన్ని వెల్లడిస్తూ రహానే భావోద్వేగానికి గురయ్యాడు. రహానే రిటైర్మెంట్‌పై తాజాగా స్పందించిన గవాస్కర్.. రాహుల్ ద్రవిడ్ తరహాలోనే అతని సామర్థ్యానికి తగిన గుర్తింపు రాలేదని అభిప్రాయపడ్డాడు. 'కెప్టెన్‌గా అజింక్యా రహానేకు అద్భుతమైన రికార్డ్ ఉంది. అతను 6 టెస్ట్‌లకు కెప్టెన్సీ చేస్తే.. నాలుగు విజయాలు సాధించాడు. ఒక్క మ్యాచ్ కూడా ఓడిపోలేదు. రాహుల్ ద్రవిడ్ సారథ్యంలోనూ భారత్ అద్భుతమైన విజయాలు సాధించింది. కానీ అతనికి దక్కాల్సిన గుర్తింపు రాలేదు. అలాగే రహానే నాయకత్వానికి కూడా గుర్తింపు లభించలేదు. అయితే భారత క్రికెట్‌లో ఇది సర్వసాధారణం. జట్టు గెలిచినప్పుడు వ్యక్తిగత ప్రదర్శనలను కొనియాడటం.. ఓడినప్పుడు మాత్రం కెప్టెన్, కోచ్‌లను నిందించడం సాధారణమే. 2021 ఆస్ట్రేలియా పర్యటనలో తొలి టెస్ట్‌లో టీమిండియా 36 పరుగులకే ఆలౌటై ఘోర పరాజయం మూటగట్టుకుంది. ఆ తర్వాత కోచ్ రవిశాస్త్రితో కలిసి రహానే జట్టును మెరుగైన స్థితికి చేర్చాడు. ఆస్ట్రేలియాకు కంచుకోట లాంటి బ్రిస్బేన్ గబ్బా మైదానంలో భారత్‌కు చిరస్మరణీయమైన విజయాన్ని అందించి సిరీస్ అందించాడు. వాస్తవానికి గబ్బా టెస్ట్‌కు స్టార్ ఆటగాళ్లంతా గాయాలు, వ్యక్తిగత కారణాలతో అందుబాటులో లేకుండా పోయారు. అయినా కుర్రాళ్లతో రహానే జట్టును అద్భుతంగా నడిపించి గొప్ప విజయాన్ని అందించాడు. రహానే నిస్వార్థమైన ఆటతీరుకు అభిమానుల నుంచి అభినందనలు వెల్లువెత్తాయి. అతను సగర్వంగా ఆట నుంచి వైదొలిగాడు. ఆటలో ఒక్క శత్రువు కూడా లేని క్రికెటర్లు నాకు తెలిసి అరడజను కంటే తక్కువమందే ఉంటారు. వారిలో రహానే ఒకడు'అని గవాస్కర్ పేర్కొన్నాడు.